PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 214 | విజయవాడ, శుక్రవారం 7 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 7 March 2025 | Rs

ప్లే-ఆఫ్స్‌కు చేరువలో ముంబయి

- యుపిపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం

8

ఉచిత బస్సు జిల్లాలకే పరిమితం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టనున్న ఉచిత బస్సు ప్రయాణం కేవలం జిల్లాలకు మాత్రమే పరిమితమని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడించారు. శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా వైసిపి సభ్యులు పివి సూర్యనారాయణ రాజు శాసనమండలిలో గురువారం ఈ అంశాన్ని లేవనెత్తారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెడితే అన్నవరం నుంచి తిరుపతి వెళ్లేందుకు మహిళ లు ఎదురుచూస్తున్నారని అన్నారు. మంత్రి సంధ్యారాణి జోక్యం చేసుకొని ఉచిత బస్సు జిల్లాలకే పరిమితమని సమాధానం చెప్పారు.

ఆశాల పోరుబాట

• వేలాదిగా విజయవాడకు • నినాదాలతో మారుమ్రోగిన ధర్నా చౌక్

- కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్
- మండలిలో ప్రస్తావిస్తాం : పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

విజయవాడ ధర్నా చౌక్‌లో మండుటెండలోనూ ఆందోళన చేస్తున్న ఆశా సిబ్బంది

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు పోరుబాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు ఆంక్షలు అమలు చేసినప్పటికీ వేలాదిగా ఆశాలు గురువారం విజయవాడకు తరలివచ్చారు. దీంతో ధర్నాచౌక్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ భారీగా కదిలివచ్చిన ఆశా వర్కర్లతో గాంధీ నగర్ సాంబమూర్తి రోడ్డు పూర్తిగా బ్లాక్ అయ్యింది. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ధర్నా చౌక్‌కు వస్తున్న ఆశా వర్కర్లే కనిపించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశించి వాహనాల రాకపోకలను ఇతర రోడ్లకు మళ్లించారు, తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. కనీస వేతనాలు అమలు చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశావర్కర్లుగా గుర్తించాలని, గతంలో జరిగిన ఒప్పందాలపై ఉత్తర్వులు విడుదల చేయాలని, ప్రభుత్వ సెలవులు, ప్రసూతి సెలవులు అమలు చేయాలని, దహన సంస్కారాల ఖర్చులకు రూ.20వ వేలు చెల్లించాలంటూ ఆశాలు నినాదాలు చేశారు. ధర్నాకు ఎపి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ అధ్యక్షత వహించారు. ధర్నాకు మద్దతు తెలిపిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అశా వర్కర్ల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ పూర్తి మద్దతు ఇస్తోందని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాల వర్కర్లకు మినిమం టైమ్ స్కేల్ వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జిఒ 2ను విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఉత్తర్వులు రద్దు చేసి కేంద్ర ప్రాయోజిత పథకాల్లో పని చేస్తున్న వారికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు గ్రాట్యూటీ పథకాన్ని ఈ నెల 8వ తేదీన సిఎం చంద్రబాబు ప్రకటించనున్నట్లు మంత్రి చెప్పారని, అదే విధంగా ఆశాలకు కూడా గ్రాట్యూటీ అమలు చేయాలని అన్నారు. ఆశావర్కర్లకు జీతంతో కూడిన ప్రసూతి సెలవు ఇవ్వాలని పిడిఎఫ్ పక్షాన డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు పదోన్నతులు కల్పించాలని, కార్మిక చట్టం ప్రకారం సెలవులు ఇవ్వాలన్నారు. ఆశాలపై రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరారు.

కనీస వేతనాలు ఇవ్వరా : సిహెచ్ నరసింగరావు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నరసింగరావు మాట్లాడుతూ... వేల కోట్లు అదానీకి దోచిపెట్టే ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇచ్చేందుకు మాత్రం చేతులు రావడం లేదన్నారు. ధర్నాకు రాకుండా పలు చోట్ల ఆశావర్కర్లను ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి అడ్డుకుందని తెలిపారు. నిర్బంధంతో ఉద్యమాలను ఆపాలనుకోవడం సరైన విధానం కాదన్నారు. మహిళా సాధికారత అని చెప్పే సిఎం మహిళలకు కనీస వేతనాలు ఇవ్వకుండా సాధికారత ఎలా సాధిస్తారని ప్రశ్నించారు.

నిర్లక్ష్యం వద్దు : కె. ధనలక్ష్మి

ఆశాల న్యాయమైన డిమాండ్ల

మిగతా 7లో

విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు ప్రాధాన్యత

కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి

ఖట్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం నాడు ఆయన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంట సేపు జరిగిన ఈ భేటీలో విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులతోపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాల గురించి ఇరువురు నేతలు చర్చించారు. సమావేశానంతరం ఎక్స్‌లో చేసిన పోస్టులో మెట్రో రైలు ప్రాజెక్టులపై ఫలవంతమైన చర్చలు జరిగినట్లు సిఎం తెలిపారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక, అభివృద్ధి ప్రాజెక్టుల గురించి చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆ తరువాత ఒక టివి ఛానల్‌తో మాట్లాడుతూ ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తారు. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి లేదని, ఇప్పుడు ఆ నిబంధన తొలగించామని అన్నారు. భవిష్యత్తులో ఇద్దరు పిల్లల కంటే తక్కువ మంది ఉంటే ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలులేదన్న నిబంధనలు రావాల్సి ఉందన్నారు. 2004, 2019లో తనను ప్రతిపక్షం ఓడించలేదని, తాను అభివృద్ధిలో మునిగిపోవడం వల్లే ఓడిపోయానని అన్నారు. దేశంలోనే అమరావతి ఉత్తమమైన రాజధాని అని, అదొక ఏంజెల్ క్యాపిటల్ అని పేర్కొన్నారు. తాను అరెస్టయినప్పుడు ప్రజలు రోడ్లపైకి వచ్చారని, చాలా ఒత్తిడిలు ఉన్నప్పటికీ 53 రోజుల పాటు రోడ్లపైనే ఉన్నారని తెలిపారు. 60 దేశాల్లో ప్రజలు సంఘీభావంగా ఆందోళనలు చేశారని అన్నారు. ఎవరైనా చనిపోయినప్పుడు ఇలా సానుభూతి వస్తుందని, తాను బ్రతికుండగానే దాన్ని చూశానని అన్నారు. సంపద సృష్టించకుండా అప్పులు చేసి ప్రజలకు డబ్బులు పంచే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో తాము వాట్సప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టామని దానిపై ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కూడా ఆలోచిస్తోందని చెప్పారు. ప్రపంచంలో ఇండియా ఆర్థిక వ్యవస్థ పదో స్థానంలో ఉండేదని, ఇప్పుడు మోడీ నాయకత్వంలో ఐదో స్థానానికి వచ్చిందని తెలిపారు. 1991లో ఆర్థిక సంస్కరణలు, ఆ తరువాత సాంకేతిక విప్లవం వంటివి దేశానికి అనుకూలతను తెచ్చి పెట్టాయన్నారు. 1995లో ఐటి గురించి మాట్లాడానని, ఇప్పుడు ఎఐ గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. కొంతమంది ఎఐ ఎకో సిస్టమ్‌ను ధ్వంసం చేస్తుందని అంటున్నారని, దేనికైనా కొన్ని ప్రతికూల అంశాలుంటాయని తెలిపారు. అందులోని అనుకూలతలనే మనం తీసుకుని ముందుకు పోవాలని పేర్కొన్నారు. ఐటి నుంచి ఎఐకి మారడం, గ్రీన్ ఎనర్జీ నుంచి గ్రీన్ నైట్రోజన్‌కు మారడం, స్కిలింగ్, కెపాసిటి బిల్డింగ్, మానవ వనరులతో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. భారత దేశం చాలా సంక్షోభాలను చూసిందన్నారు. ఇండియా విదేశాంగ విధానం చాలా ఉత్తమమైనదని, నరేంద్ర మోడీ వల్లనే ఇది సాధ్యమైందని అన్నారు.

మహిళా దినోత్సవం రోజున
అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

- సూపర్ సిక్స్, మహిళా రిజర్వేషన్లు, మహిళల అదృశ్యాలపై చర్చించండి
- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవమైన ఈ నెల ఎనిమిదవ తేదిన ప్రత్యేక అసెంబ్లీ సమవేశం నిర్వహించి, సూపర్ పిక్స్, మహిళా రిజర్వేషన్లు, మహిళల అదృశ్యాలపై విచారణ తదితర అంశాలపై చర్చించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు గురువారం లేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికలలో కూటమి నాయకత్వం 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని, ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామని, రూ.10 లక్షల రుణం తీసుకున్న పొదుపు మహిళలకు జీరో వడ్డీ ఇస్తామని, తల్లికి వందనం, మూడు ఉచిత సిలిండర్లు, తదితర పథకాలను అమలు చేస్తామని బలమైన హామీనిచ్చి ఇంటింటికీ ప్రచారం ప్రచారం చేసిన విషయాన్ని ఈ లేఖలో శ్రీనివాసరావు గుర్తుచేశారు. వాటిని విశ్వసించి కూటమికి విజయాన్ని చేకూర్చడంలో మహిళలు ముఖ్యమైన పాత్ర నిర్వహించారని తెలిపారు.. అధికారంలోకి వచ్చిన

మిగతా 7లో

రాష్ట్ర ప్రయోజనాలపై రాజీ వద్దు

- వైసిపి పార్లమెంటు సభ్యులతో జగన్
- పోలవరం ఎత్తు, విశాఖ ప్లాంటుపై చర్చ
- డీలిమిటేషన్‌పై స్పష్టత రావాలి

2

ప్రశ్నించే గొంతులపై 'స్టీల్' యాజమాన్యం దాడి

అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు కార్మికుల సమస్యలపై పోరాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గత ఏడాది అక్టోబర్ ఆరు, ఈ ఏడాది జనవరి 21, 22న స్టీల్‌ప్లాంట్ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ సోషల్ మీడియాకు, పత్రికలకు ప్రకటనలు ఇచ్చారని, కంపెనీకి వ్యతిరేకంగా ప్రకటన ఇచ్చినందుకుగాను మీపై క్రమశిక్షణ చర్యలను ఎందుకు తీసుకోకూడదో వివరించాలంటూ షోకాజ్ నోటీసులో పేర్కొంది. కంపెనీ సర్టిఫైడ్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ప్రతి ఉద్యోగి కంపెనీ ప్రతిష్టను పెంచే విధంగా ఉండాలి గానీ ప్రతికూల విమర్శలు లేదా పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయకూడదని తెలిపింది. ముందస్తు అనుమతి లేకుండా ప్రెస్‌ను ఆశ్రయించడం కంపెనీకి అపకీర్తి తెచ్చినట్లుగా ఆ నోటీల్లో పేర్కొంది. నోటీసులు అందించిన రోజు నుంచి ఏడు రోజులలోపు సంతకం చేసి యాజమాన్యానికి సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో తదనంతర చర్యలకు పూనుకుంటామని పేర్కొంది. ఈ నోటీస్ డిసిప్లినరీ అథారిటీ ఎంఎంఎస్ డిపార్టుమెంట్ నుంచి జనరల్ మేనేజర్ ఉమాకాంత్ గుప్తా జారీ చేశారు.

పోరాడితే నోటీసులా : అయోధ్యరామ్

సంస్థ అభ్యున్నతి కోసం ప్రతి కార్మికుడూ శక్తివంచన లేకుండా కష్టపడి పని చేస్తారని, కార్మికునికి కష్టం వస్తే ప్రశ్నించే గొంతుకునవుతానని అయోధ్యరామ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జారీ చేసిన షోకాజ్ నోటీసులు కార్మికుల సమస్యలపై పోరాడటాన్ని నిలుపుదల చేయలేవన్నారు. సిఐటియుగా కార్మికుల సమస్యలపై స్టాండ్ తీసుకున్నామని, కార్మికులకు అన్యాయం చేస్తే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున పోరాడుతామని అన్నారు. విఆర్‌ఎస్‌పైనా, కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాల సమస్యపైనా పోరాడుతున్నామని తెలిపారు. ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా అర్ధరూపాయి యూనిట్ కరెంటు ఛార్జీని ఎనిమిది రూపాయలకు పెంచడం సరికాదని, హెచ్‌ఆర్‌ఎను తొలగించడం అన్యాయమని తాను మాట్లాడినందుకు షోకాజ్ నోటీసులు అందించారని తెలిపారు.

పోలీసులు తీసుకువెళ్లిన దళిత బాలుడి మృతి

- తల్లిదండ్రుల అనుమానాలు

బంగారు యశ్వంత్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, స్పోర్ట్స్

ద్విచక్రవాహనాల చోరీ కేసులో పోలీసులు తీసుకువెళ్లిన దళిత బాలుడు మృతి చెందిన సంఘటన ఏలూరులో కలకలం రేపింది. పోలీసులే తమ కుమారుడినిచంపారంటూ తల్లిదండ్రులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుని తల్లిదండ్రులు, బంధువుల కథనం మేరకు... ఏలూరు చేపలతూము సెంటర్‌కు చెందిన దళిత బాలుడు బంగారు యశ్వంత్ (17) స్థానికంగా పదవ తరగతి చదువుతున్నారు.నాలుగు రోజుల క్రితం రాత్రిపూట పోలీసులు ఇంటికి వచ్చి తమ మనవడు యశ్వంత్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ద్విచక్రవాహనాల చోరీ కేసులో తీసుకెళ్తున్నట్లు పోలీసులు తెలిపారని ఆమె నాయనమ్మ చెప్పారు. తమ మనవడు ఆసుపత్రిలో చనిపోయి ఉన్నట్లు కొందరు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. సిసిఎస్ పోలీసులే తమ కుమారుడిని చంపేశారంటూ యశ్వంత్ తండ్రి శివ ఆరోపిస్తున్నారు. పోలీసులు చంపారు అనడానికి తమ కుమారుడు ఒంటిపై ఉన్న దెబ్బలే నిదర్శనమన్నారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించడానికి సర్వజన ఆసుపత్రికి వచ్చిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని యువకుడి తల్లిదండ్రులు, బంధువులు కలిశారు. ఘటనపై విచారించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని ఆమె తెలిపారు.

యశ్వంత్ మృతికి సంబంధించి పెదవేగి పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఎఫ్ఐఆర్ నమోదైంది. పోలవరం కాలువ గట్టు వద్దకు బహిర్భూమికి వెళ్లి స్పృహతప్పి పడిపోయినట్లుగా చూసిన వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారని, గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించినట్లు, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బాలుడి అన్న బంగారు కృష్ణవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం పెదవేగి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

న్యాయ విచారణ జరిపించాలి : సిపిఎం

దళిత బాలుడి మృతిపై జిల్లా కలెక్టర్ న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి, పట్టణ నాయకులు డిఎన్‌వి ప్రసాద్ డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని కోరారు.

నిరంతర విద్యా ప్రస్థానంలో సిద్ధార్థ స్వర్ణోత్సవ మైలురాయి

1975లో దార్శనికులైన దాతలబృందం స్థాపించిన సిద్ధార్థ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిరంతర విద్యావ్యాప్తికి పునరంకితమవుతూ స్వర్ణకాంతులు వెదజల్లుతోంది. అత్యుత్తమ జ్ఞానం, నైపుణ్యంతో కూడిన విద్యాబోధనతో లక్షలాది విద్యార్థులను ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో విజేతలుగా, ఉత్తమపౌరులుగా మలచింది. సంప్రదాయ విద్య, సాంకేతిక విద్య, ఉన్నత విద్య... అన్ని రకాల కోర్సులతో అందరికీ విద్యను అందుబాటులోకి తెచ్చి విజ్ఞానసర్వస్వంగా నిలిచింది సిద్ధార్థ.

మార్చి 7న స్వర్ణోత్సవ కార్యక్రమాల ప్రారంభం

యు.జి.సి. ఛైర్మన్ ఆచార్య **మామిడాల జగదీష్ కుమార్** స్వర్ణోత్సవాల లోగో ఆవిష్కరిస్తారు..టీజర్ విడుదల చేస్తారు.

ఈ డిశంబరు వరకు సిద్ధార్థ విద్యాసంస్థల్లో ...

పారిశ్రామిక | వాణిజ్య సదస్సులు | విజ్ఞాన ప్రదర్శనలు | జాతీయ, అంతర్జాతీయ విద్యాసదస్సులు | సాహిత్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు

18 విద్యాసంస్థలు.. విద్యార్థులు 26,500 బోధన, బోధనేతర సిబ్బంది 3,500

170 విద్యా కార్యక్రమాలు 3 లక్షల 50 వేల పుస్తకాలతో గ్రంథాలయాలు

11300 పరిశోధక పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురణ

750 పేటెంట్ల నమోదు సైన్స్, ఇంజనీరింగ్ మేధో హక్కులు

15 ఎన్.సి.సి. కేడెట్లు ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఎంపిక

1st ఎలక్ట్రానిక్ డేటా సమాచారవ్యాప్తికి దేశంలోనే మొదటిసారిగా VSAT సదుపాయ కల్పన

స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సిద్ధార్థ సంస్థలు :

- పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్
- A.G. & S.G. సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల

సిద్ధార్థ అకాడమీ నిర్వహణలో విద్యాసంస్థలు...

- వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్
- శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల
- వై.వి. రావు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్
- వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ (సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ (డీమ్డ్ యూనివర్సిటీ)
- శ్రీమతి వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల
- కె.సి.పి. సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్
- కొమ్మారెడ్డి వెంకట సదాశివరావు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్
- ప్రసాద్ వి. పొట్లూరి సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి
- సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ & క్యాటరింగ్ టెక్నాలజి
- డా. పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ & రీసెర్చ్ ఫౌండేషన్
- డాక్టర్ సి. శోభనాద్రి సిద్ధార్థ స్కూల్ ఆఫ్ నర్సింగ్
- డాక్టర్స్ సుధ & నాగేశ్వరరావు సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్
- డాక్టర్ సి. శోభనాద్రి సిద్ధార్థ కాలేజీ ఆఫ్ నర్సింగ్

సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ & టెక్నికల్ ఎడ్యుకేషన్

• (ఉన్నత విద్యకు ఊతమిచ్చే ఉత్తమ బోధన, నైపుణ్యాల సమున్నత వేదిక) | 91-866-2475866, 2476026 | siddhartha.academy@yahoo.in

బిసి సంక్షేమ పథకాలకు 10 నుంచి దరఖాస్తులు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి సంక్షేమ పథకాల యూనిట్ల ఏర్పాటుకు అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా గత నెలలో ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో దరఖాస్తులు స్వీకరించలేదన్నారు. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఒబిఎంఎంఎస్ పోర్టల్‌లో రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

త్వరలో ఆన్‌లైన్ డిఎస్‌సి కోచింగ్

ఉచిత ఆన్‌లైన్ డిఎస్సి కోచింగ్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఇందుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో బిసి స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత డిఎస్సి కోచింగ్ సెంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు. తాజాగా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో డిఎస్సి కోచింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ జిల్లాలకు చెందిన బిసి సంక్షేమ శాఖాధికారులు సంప్రదించాలని సూచించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విద్యతోనే మహిళల అభివృద్ధి

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆడ పిల్లల చదువును ప్రోత్సహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. ఎపి సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వెలగపూడిలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో ఆమె మంత్రులు నిమ్మల రామానాయుడు, ఎస్.సవిత, వి.అనిత తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆడ పిల్లలకు గౌరవ మర్యాదలను పెంచుతూ మహిళల విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కె.వైదురీదేవి, ఉపాధ్యక్షులు ఎం.లక్ష్మణకుమారి, కార్యదర్శి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కల్పిత బడ్జెట్ : అంబటి విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కల్పిత అంకెలతో బడ్జెట్ అభివృద్ధిని చూపిస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అప్పులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ తప్పుడు అంకెలతో అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. మైనింగ్, లిక్కర్ మాఫియాలతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ విషయంలో ప్రజలను మోసం చేశారని, తమ పార్టీ అధినేత జగన్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కూటమి నేతలు తోకముడిచారని అన్నారు. జనసేన, టిడిపి రెండూ కుటుంబ పార్టీలేనని పేర్కొన్నారు. తండ్రి కొడుకుల పార్టీ టిడిపి అయితే, అన్నదమ్ముల పార్టీ జనసేన అని అన్నారు. పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ సమాధానం చెబితే తట్టుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలన్నిటికీ చంద్రబాబు ప్రభుత్వం తూట్లు పొడిచిందని అన్నారు. ప్రతిపక్ష గుర్తింపు అంశంపై లేని అంశాలను సభలో చెప్పారనే ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్‌ను కార్పొరేటర్‌కు ఎక్కువ, ఎమ్మెల్యేకు తక్కువ అని జగన్ అనాల్సి వచ్చిందని పేర్కొన్నారు. బంధుప్రీతితోనే నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇస్తున్నారని, కాదని ఎవరైనా చెప్పగలరా అని ప్రశ్నించారు.

నేడు నాగబాబు నామినేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి అభ్యర్థిగా జనసేన తరపున కొణిదెల నాగబాబు ఈ నెల 7న మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా నామినేషన్ దాఖలుకు అవసరమైన పత్రాలను పార్టీ కార్యాలయంలో సిద్ధం చేశారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది శాసనసభ్యులు సంతకాలు చేశారు. వీరిలో నాదెండ్ల మనోహర్, మండలి బుద్ధ ప్రసాద్, లోకం నాగమాధవి, ఆరణి శ్రీనివాసులు, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, అరవ శ్రీధర్, బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీ సంతకాలు చేసిన వారిలో ఉన్నారు.

దేశానికి పనికొచ్చే రచనలతో భావితరాలకు మేలు

'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణలో నిర్మలా సీతారామన్, వెంకయ్యనాయుడు, చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశానికి పనికొచ్చే విలువలతో కూడిన రచనలు భావితరాలకు ఎంతో అవసరమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' (ఆది నుండి నేటివరకూ - ఆ తర్వాత) పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం విశాఖలోని గీతం యూనివర్శిటీలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... 40 ఏళ్లుగా రాజకీయ నాయకునిగా ఉండి ఒక మహాసముద్రాన్ని ఈదినట్టు 350 పేజీల ఈ పుస్తకాన్ని వెంకటేశ్వరరావు రాయడం ఆయన నైపుణ్యానికి కొలమానమన్నారు. అనంతరం పుస్తక పరిచయం చేశారు. అమెరికాలో ట్రంప్ తాజాగా అధికారం చేపట్టిన తర్వాత పరిణామాలను కూడా చరిత్రగా రాయండంటూ వెంకటేశ్వరరావును ఉద్దేశించి నవ్వుతూ నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించడంతో సభికుల ముఖంలో నవ్వులు విరిశాయి. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్రను పుస్తకంగా రాయడం అంత సులభమైనది కాదని అన్నారు. చరిత్ర ద్వారానే మానవాళికి గతంలో జరిగిన మంచి, చెడులు తెలుస్తాయన్నారు. బ్రిటిష్‌వారు భారత చరిత్రను వక్రీకరించి రాశారని, దేశ విభజన కారణంగా చాలా చరిత్రను కోల్పోయామని తెలిపారు. గతానికి సంబంధించిన నమోదు అనేది తటస్థ వైఖరితో ఉండాలన్నదే తమ విధానమన్నారు. సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్ దగ్గర తానూ, దగ్గుబాటి 1980వ దశకంలో చాలా నేర్చుకున్నామని అన్నారు. ఆయన రాసిన ప్రపంచ చరిత్ర అందరూ చదవాల్సిందన్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం తమ కుటుంబ ఆత్మీయ సమ్మేళనంలా ఉందని చెప్పారు. పుస్తక రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రపంచంలో అనేక దేశాలు తాను తిరిగి సంపాదించిన జ్ఞానంతో ఈ పుస్తకం రాశానని అన్నారు. చాట్ జిపిటిలో పుస్తకాన్ని అప్‌లోడ్ చేస్తే వరల్డ్ ఫేమస్ పుస్తకాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఎంపి దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ.. వెంకటేశ్వరరావు రాజకీయ ప్రస్థాన అనుభవానికి నిదర్శనంగా ఈ పుస్తకం నిలిచిందని కొనియాడారు. వేదికపై విశాఖపట్నం ఎంపి శ్రీభరత్ ఉన్నారు.

'ప్రపంచ చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్మలా సీతారామన్, వెంకయ్యనాయుడు, చంద్రబాబు తదితరులు

ఆత్మహత్యల నివారణకు స్కూల్ వెల్‌నెస్ టీమ్స్

- మండలిలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు స్కూల్ వెల్‌నెస్ టీమ్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ టీమ్స్ ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయా? లేదా అని టిడిపి ఎమ్మెల్సీలు బి తిరుమల నాయుడు, దువ్వారపు రామారావు, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రిని అడిగారు. రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరగడం లేదని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు నాయుడు, రామారావు, భూమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యలు రాష్ట్రంలో జరుగుతున్నాయని చెప్పారు. ఇటీవల ఒక విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు.

ఆత్మహత్యల విషయాన్ని కేసు నమోదు చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాలల యాజమాన్యాలు బెదిరింపులు చేయడంతో పాటు ప్రలోభాలకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై ప్రభుత్వ నియంత్రణ లేదన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలపై చక్రపాణి కమిటీ నివేదిక ఇచ్చిందని, దీనిని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల జీవితాలను బలి చేయొద్దు : పిడిఎఫ్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. తల్లిదండ్రులు డబ్బులు ఖర్చుచేసి పిల్లలను చదివిస్తున్నారని, కొంతమంది పిల్లలు చదువును అందుకోలేకపోతున్నారని తెలిపారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలకు తగ్గట్టుగా కళాశాలల యాజమాన్యాలు వారి తల్లిదండ్రులతో చర్చించాలని తెలిపారు. విద్యార్థి లోపంగా, నిందాపూర్వకంగా చెప్పకూడదన్నారు. మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థుల జీవితాలను బలి చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా ఈ ధోరణి కార్పొరేట్ విద్య వ్యవస్థలో ఉందని వివరించారు. ఇది ప్రభుత్వ పాఠశాలలకు కూడా వస్తుందన్నారు. దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. మండలి చైర్మన్ కె మోషేను రాజు జోక్యం చేసుకొని విద్యార్థుల ఆత్మహత్యలు జరగడం లేదని ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని, సభ్యులు మాత్రం ఈ అంశంపై ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఒత్తిడి తగ్గించేందుకు అసెంబ్లీ, ఆటలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాలను ప్రైవేట్ విద్యాసంస్థల్లో కూడా అమలు చేయాలని వైసిపి సభ్యులు టి మాధవరావు సూచించారు. ఆత్మహత్యలు పెరగడం లేదని చెప్పిన మంత్రి లోకేష్ నివారణకు విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు స్కూల్ వెల్‌నెస్ టీమ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వీటిద్వారా ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఓరియంటేషన్ ఇస్తామన్నారు.

ఈ ఏడాదిలో యూనివర్సిటీల్లో పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఈ ఏడాది భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఎస్సి వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదిక వచ్చిన వెంటనే ఆ ప్రక్రియ కూడా ప్రారంభిస్తామన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఎప్పటిలోగా భర్తీ చేస్తారో చెప్పాలని రామగోపాల్ రెడ్డి, రామారావు విద్యాశాఖ మంత్రిని అడిగారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సాంకేతిక, సాధారణ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 5 వేల బోధన పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వీటిని త్వరితగతిన భర్తీ చేసేందుకు విధివిధానాలు ఏమైనా రూపొందించారా అని అడిగారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో నియామకాల అంశం కోర్టులో ఉందని, అడ్వకేట్ జనరల్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఏడాదిలోపు నియామకాలు చేస్తామన్నారు. విశ్వవిద్యాలయాలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రం 9వ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఈ ఏడాదిలోపు ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ఎపి(లీప్) పేరుతో సెక్టర్స్ స్పెసిఫిక్ ఇన్‌స్టిట్యూషన్లపై దృష్టి సారించి డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు, యూనివర్సిటీలతో క్లస్టరింగ్ చేయాలనేది తన నిర్ణయమని చెప్పారు.

అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు

- మహిళా దినోత్సవం రోజు ప్రకటించనున్న సిఎం
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయనున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడించారు. 1.10 లక్షల మంది అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ కోసం రూ.20 కోట్లు కేటాయించామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల గౌరవ వేతనం, గ్రాట్యుటీ ఎప్పటి నుంచి అమలు చేస్తారని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, బి గోపిమూర్తి శాసనమండలిలో మంత్రి సంధ్యారాణిని గురువారం అడిగారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్‌వాడీలతో జరిగిన ఒప్పందాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2019 తరువాత అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. 2022లో అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ కింద రూ.5లక్షలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, వీటిని పెంచి అమలు చేయాలని కోరారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.1000లు అదనంగా పెంచుతామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. గోపిమూర్తి అంగన్‌వాడీలు తక్కువ వేతనం చెల్లిస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వీరికి కూడా అమలు చేయాలని కోరారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గ్రాట్యుటీ ఫైల్‌పై ముఖ్యమంత్రి సంతకం చేశారని, మహిళా దినోత్సవం రోజు ఆయన ప్రకటన చేస్తారని చెప్పారు. మట్టి ఖర్చుల కోసం రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 6,837 మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్చబోతున్నామని, వీటికి భవనాలు కూడా మంజూరు చేశామని తెలిపారు. అంగన్‌వాడీలకు గతంలో రెండు సార్లు వేతనాలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే అని తెలిపారు. మరలా ఆయనే వేతనాలు పెంచుతారని చెప్పారు.

నియామక తేదీనే పరిగణలోకి తీసుకోవాలి : పిడిఎఫ్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను వారి నియామక తేదీని పరిగణనలోకి తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు కోరారు. నియామకమైన తేదీ నుంచి రెండేళ్లలోపు రెగ్యులర్ చేస్తామన్న ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ 1,19803 మంది సచివాలయ సిబ్బంది ఉన్నారని, వారి రేషనలైజేషన్ ప్రక్రియ జరుగుతుందని, సర్వీస్ నియమావళిని రూపొందిస్తున్నామని చెప్పారు.

స్వర్ణాంధ్ర సాధనకు స్వచ్ఛాంధ్ర

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతి నెలా మూడవ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర దివస్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని శాఖలను ఆదేశించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రకు సంబంధించిన కార్యక్రమాల ఖరారుపై సచివాలయం నుంచి శాఖాధిపతులు, కార్యదర్శులతో గురువారం ఆయన వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. విజన్ 2047 లక్ష్యాలను సాధించే దిశగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రకు సంబంధించి ప్రత్యేక రోడ్ మ్యాప్ రూపొందించి ఇదివరకే ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శాఖల వారీగా కార్యక్రమాలు రూపొందించినట్లు ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ రెడ్డి, పురపాల శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి పాల్గొనగా, వర్చువల్‌గా వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న పాల్గొన్నారు.

పోలవరం బాధ్యత కేంద్రానిదే

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి, పోలవరం పూర్తి బాధ్యత తమదేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో కేంద్ర బడ్జెట్-2025-26పై పలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన కస్టమ్స్, ఎక్సైజ్, పోర్టు అధికారులతో ఆమె చర్చలో పాల్గొన్నారు. అనంతరం మీడియా కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ నుంచి కొన్ని సాంకేతిక సమస్యలపై రాష్ట్రాన్ని వివరణ కోరినప్పుడు ఎపిలోని సాంకేతిక నిపుణులు ఇచ్చే సమాచారంపై ఆధారపడి పోలవరానికి నిధుల విడుదల ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. కేంద్రంతో అనుసంధానమైన ప్రతి ప్రాజెక్టునూ పూర్తిచేసేందుకు సహకారం అందిస్తామన్నారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు నిధులు రావడం లేదని అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ డిపిఆర్ ఆమోదం పొందితే నిధులొస్తాయన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి అన్నీ చేశామని, రూ.11 వేల కోట్లకుపైగా నిధులిచ్చి సహకరించామని తెలిపారు.

బ్యాంకుల నుంచి కేంద్రం ఆర్ఐఎన్ఎల్‌కు సాయం అందించిందని, స్థిరంగా ప్లాంట్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యత కార్మికులదేనంటూ ఆమె సమాధానమిచ్చారు. ఇతర దేశాల మాదిరిగా మనదేశం అభివృద్ధి కావాలంటే పన్నుల విధానం కొంచెం కఠినంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సంబంధించిన ఆర్థిక ప్యాకేజీపైనా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిధులకు కేంద్ర సాయంపైనా మంత్రిని ప్రశ్నించగా సమాధానం దాటవేశారు.

బియ్యం అక్రమ రవాణాదారులపై పిడియాక్ట్ : నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నవారిపై క్రిమినల్ కేసులతో పాటు, పిడియాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శాసనసభలో గురువారం పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, ప్రైవేట్ గోదాముల్లో పిడిఎస్ బియ్యంపై సభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, దామచర్ల జనార్ధన్‌రావు, కాగిత కృష్ణప్రసాద్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2019-24మధ్య పౌరసరఫరాల శాఖ చేసిన దాడుల్లో 76854 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ 9,664 మంది అరెస్టుకాగా ఇందులో 148 మంది రెండు సార్లు అంతకంటే ఎక్కువ సార్లు అరెస్టయ్యారన్నారు. ఆరు నెలల కాలంలో 60 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు 512 వాహనాలను అదుపులోకి తీసుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు, ప్రభుత్వ హాస్టళ్లకు మధ్యాహ్నం భోజనం కింద సన్న బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో మే నెల నుంచి సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

అమరావతిలో యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రం

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకరించారని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయుష్ విభాగంపై జరిగిన చర్చకు ఆయన బదులిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 327 వైద్యాధికారుల పోస్టులు ఉంటే అందులో 62 హోమియో విభాగంలో 190 పోస్టులుంటే అందులో 62 ఖాళీగా ఉన్నాయన్నారు. యునాని విభాగంలో 73 పోస్టులకు 32 ఖాళీలు ఉన్నాయన్నారు. పారామెడికల్ పోస్టులు 323 మంజూరుకాగా అందులో 272 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. .

9 నెలల్లో 39 మంది రైతు ఆత్మహత్యలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో వ్యవసాయ సంబంధ కారణాలతో 39 మంది రైతులు ఆత్మహత్యలు నమోదయ్యాయని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల కుటుంబాలను ఆదుకోవడానికి పునరావాస ప్యాకేజీగా రైతులు,కౌలు రైతుల కుటుంబ సభ్యులకు రూ.7లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. 2024 జూన్‌కు వముందు 103 ఆత్మహత్యలు జరిగాయని చంద్రన్న బీమా పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.

14న 'ఉక్కు' నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఈ నెల 14న తలపెట్టిన నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ఎనిమిది వేల మంది ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖ జగదాంబ సెంటర్ సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం జెఎసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కుపై ఈ నెల 14న ఉదయం 10 గంటలకు విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి జరిగే భారీ నిరసన ప్రదర్శనలో పెద్దఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి దేవా, సిఎస్‌టియుఐ జిల్లా కార్యదర్శి కె లక్ష్మి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ కెఎం కుమార మంగళం, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి మణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలపై రాజీ వద్దు

- వైసిపి పార్లమెంటు సభ్యులతో జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడొద్దని వైసిపి ఎంపిలకు పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం ఉదయం తాడేపల్లిలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో వైసిపి పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. పోలవరం ఎత్తు, విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణ, మిర్చికి మద్దతు ధర, వన్‌నేషన్ వన్ ఎలక్షన్, కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ పలు అంశాలపై చర్చించారు. పార్లమెంటు ఉభయ సభల్లో చర్చించాల్సిన, లేవనెత్తాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు అంశం కీలకమైందని, దాని తగ్గింపు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని తెలిపారు. కేంద్ర క్యాబినెట్లో ఉన్న టిడిపి సభ్యులు ఎత్తు తగ్గింపు అంశంపై నోరెత్తకపోవడం అన్యాయమని అన్నారు. దీనిపై పార్లమెంటులో గట్టిగా పోరాడాలని సూచించారు. విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. అలాగే పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తరాదికి ఎక్కువ సీట్లు పెరిగి, దక్షిణాదికి తగ్గుతాయనే అంశంపై స్పష్టత వచ్చేలా పార్లమెంటులో ప్రస్తావించాలని సూచించారు. వన్‌నేషన్ వన్ ఎలక్షన్ కింద ఎన్నికలు జరపాలనే ఉద్దేశం కేంద్రానికి ఉంటే ఈవిఎంలు కాకుండా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండు చేయాలని సూచించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ పద్ధతుల్లోనే ఎన్నికలు జరుగుతున్నాయని, మొదటి ఇవిఎంలో నిర్వహించిన దేశాలు కూడా బ్యాలెట్ పద్ధతుల్లోకి మారాయని జగన్ తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా తెచ్చిన 17 మెడికల్ కళాశాలల్లో పూర్తయిన వాటిని ప్రైవేటుకు అప్పగించాలనే చంద్రబాబునాయుడు విధానంపై పార్లమెంటులో లేవనెత్తాలని సూచించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేయాలనే చూస్తుంటే కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని అన్నారు. పలు అంశాలపై చర్చించిన అనంతరం పలువురు ఎంపిలు మాట్లాడుతూ జడ్‌ప్లస్ కేటగిరీ భద్రతలోఉన్న జగన్‌కు పోలీసు భద్రత కల్పించకపోవడంపైనా పార్లమెంటులో లేవనెత్తుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసిపి పార్లమెంటరీ పార్టీనేత వై.వి.సుబ్బారెడ్డి, లోక్‌సభాపక్షనేత మిధున్‌రెడ్డి, వైసిపి ఎంపిలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, గొల్లబాబూరావు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎం.గురుమూర్తి, తనూజారాణి, రఘునాథరెడ్డి, పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల పాల్గొన్నారు.

కులాంతర వివాహాలకు రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కులాంతర, ప్రేమ వివాహాలు చేసుకున్నవారిని హత్య చేస్తున్న తల్లిదండ్రులను కఠినంగా శిక్షించాలని ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. కుప్పం, అనంతపురం జిల్లా గుంతకల్లులో చోటుచేసుకున్న ఇలాంటి దారుణ ఘటనలకు కారకులైన తల్లిదండ్రులను కఠినంగా శిక్షించాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి, చేసుకోబోయే వారికి రక్షణ, భద్రత, ఆసరా కల్పించాల్సిన ప్రభుత్వాలు మౌనం వహించడం పరోక్షంగా కుల అహంకారులకు మద్దతు పలకడమేనన్నారు. ప్రేమగా పెంచుకున్న బిడ్డలను హత్య చేసి హంతకులుగా మారుస్తున్న కుల అహంకార ప్రచారాలపై, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులపై, వివక్షతపై చర్యలు తీసుకోవాలని, ఈ రెండు ఘటనల్లో దోషులపై ఫాస్ట్ ట్రాక్ విచారణ చేసి శిక్షించాలని కోరారు. కులాంతర వివాహం చేసుకున్నవారికి కేరళ ప్రభుత్వం తరహాలో రూ.పది లక్షల పారితోషికం, ఇల్లు, ఉద్యోగం కల్పించాలన్నారు. ప్రేమించుకుని వివాహం చేసుకునే వారికి, దండల వివాహన్ని గుర్తించి వివాహ పద్ధతిని సులభతరం చేయాలని కోరారు. యువతీ, యువకులు వివాహం పరస్పర గౌరవం, విశ్వాసంతో వివాహ భాగస్వామిని స్వతంత్రంగా ఎంపిక చేసుకోవాడాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కుల ఉన్మాదాలను సమూలంగా అరికట్టే విధంగా చర్యలు చేపట్టాని ఈ సందర్భంగా కోరారు.

మేలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఎయు) రాష్ట్ర మహాసభను మే 18, 19, 20 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.నాగబ్రహ్మాచారి, సిపిడిసిఎల్ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మహాసభ ఆహ్వాన పత్రాన్ని గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగం ప్రయివేటీకరణను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరింత వేగవంతం చేస్తోందన్నారు. విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నేషనల్ కోఆర్డినేషన్ పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తుందని, అనేకచోట్ల ప్రయివేటీకరణను అడ్డుకుంటోందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు జరిగే పోరాటాలకు మద్దతు ఇవ్వడంతోపాటు, ఉద్యోగ కార్మిక సమస్యలపై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ పని చేస్తుందని తెలిపారు. గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకునేందుకు జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, నాయకులు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర పెంచాలి

- స్వల్పకాలిక చర్చలో సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయాన్ని ఎన్ఆర్ఇజిఎస్‌కు అనుసంధానం చేయడంతో పాటు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని ఇంకొంత పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులందరూ ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. 344 నిబంధన కింద గురువారం శాసనసభలో "ధాన్యం కొనుగోలు - నగదు చెల్లింపులు" అంశంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, షాజహాన్ బాషా, పత్తిపాటి పుల్లారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పులివర్తి రామాంజనేయులు, వేగుల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సన్న ధాన్యం పండించే రైతులకు బోనస్ ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులును అమలు చేయలన్నారు. ధాన్యం అమ్ముకునేందుకు ఆ జిల్లా ప రిధిలోనే కాకుండా పక్క జిల్లాల్లో కూడా అమ్ముకునే వీలు కల్పించాలన్నారు. మదనపల్లి టమోటా రైతులను ఆదుకోవాలని సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మిల్లర్లు, రైతులు, అధికారులు ఒకే చోట తేమ శాతాన్ని చూస్తే రైతుకు లాభం చేకూరుతుందని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలన్నారు. మిల్లర్లు తేమశాతం పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానమిస్తూ వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ పేరుతో రూ.41వేల కోట్ల రుణాలు చేసిందన్నారు. ధాన్యం కూడా వారికి అనుకూలంగాఉన్న మిల్లర్లకు మాత్రమే అనుమతినిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతు సహాయక కేంద్రాలు దళారులు కేంద్రంగా వైసిపి పాలనలో మార్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

వాచ్‌మెన్ రంగన్న మృతిపై అనుమానం

- పోలీసులకు ఆయన భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ (వైఎస్‌ఆర్ జిల్లా)

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆయన భార్య సుశీలమ్మ ఆరోపించారు. వైఎస్‌ఆర్ జిల్లా పులివెందుల పోలీసులకు ఆమె గురువారం ఫిర్యాదు చేశారు. తాను ఇంటిలో లేని సమయంలో రంగన్నకు అపాయం కలిగించారని అనుమానంగా ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ నరసింహులు సిఆర్‌పిసి 174 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. వివేకా హత్య జరిగిన రోజు నిందితులను రంగన్న ప్రత్యక్షంగా చూశారు. ఇదే విషయాన్ని జమ్మలమడుగు కోర్టు మెజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం కూడా ఇచ్చారు. రంగన్న భద్రత కోసం సిబిఐ అధికారులు గన్‌మెన్లను కూడా నియమించారు. ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధులతో రంగన్న కొంతకాలంగా బాధపడుతున్నారు. రెండు వారాల కిందట కిందపడటంతో కాలికి గాయమైంది. అప్పటి నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ పులివెందులలోని ఇంటి వద్దే ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం ఊపిరాడటం లేదని తెలపడంతో కుటుంబ సభ్యులు, రక్షణగా ఉన్న కానిస్టేబుల్ కడప రిమ్స్‌కు తరలించారు. సాయంత్రం 6:50 గంటలకు రంగన్న మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణాధికారిగా సిఐ ఉలసయ్యను అధికారులు నియమించారు. పోలీసులు పూర్తి విచారణ చేసి సిబిఐ అధికారులకు నివేదిక అందించనున్నారు. కడప రిమ్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియ నిర్వహించారు.

పోసాని కస్టడీ పిటిషన్ తీర్పు రిజర్వ్

ప్రజాశక్తి - ఆదోని

సినీ నటుడు పోసాని కృష్ణమురళి కేసుపై కర్నూలు జిల్లా ఆదోని కోర్టులో గురువారం విచారణ జరిగింది. పోసాని కృష్ణమురళిని కస్టడీకి అనుమతించాలని ఆదోని త్రీ టౌన్ పోలీసులు జెఎఫ్‌ఎంఎస్ కోర్టులో పిటిషన్ వేశారు. పోసాని కృష్ణమురళికి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు లాయర్లు జీవన్ సింగ్ కోర్టులో పిటిషన్ వేశారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి అపర్ణ తీర్పును రిజర్వు చేశారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేశ్వరి వాదనలు వినించారు.

వెలుగొండకు వెళ్లొద్దు

- సిఎంకు సూచించిన అధికారులు
- విఫలమైన ఎమ్మెల్యే ప్రయత్నాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రకాశం జిల్లా పర్యటనలో వెలుగొండ ప్రాజెక్టు వద్దకు వెళ్లొద్దని సిఎం చంద్రబాబుకు అధికారులు సూచించారు. బడ్జెట్‌లో వెలుగొండకు అరకొర నిధుల కేటాయింపు, మార్కాపురం జిల్లా ఏర్పాటు హామీ అమలుపై నిరసనలు వెల్లువెత్తే అవకాశం ఉన్నందున్న కేవలం మహిళా దినోత్సవం కార్యక్రమానికే సిఎం పర్యటనను సిఎంఒ అధికారులు పరిమితం చేశారు. ప్రాజెక్టు సందర్శన, నిర్వాసితుల ప్యాకేజీపై సిఎంతో ప్రకటన చేయించాలని భావించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రయత్నాలు విఫలమయ్యాయి.పోలవరం తర్వాత వెలుగొండ ప్రాజెక్టు కీలకమైనది. 4.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల జనాభాకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు నిధుల విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారు. బడ్జెట్‌లో కేవలం రూ. 309 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి రూ.నాలుగు వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా అరకొర నిధులు కేటాయించారు. సిఎం పర్యటనలో వెలుగొండ ప్రాజెక్టు సొరంగాలు పరిశీలన, నిర్వాసితుల ప్యాకేజీ విషయంపై చంద్రబాబు మాట్లాడుతారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు పశ్చిమ ప్రాంత నేతలు భావించారు. దీంతో సిఎం షెడ్యూల్‌లో వెలుగొండ పర్యటన చేర్చాలని ఎమ్మెల్యే భావించారు. ఈ విషయాన్ని సిఎం పర్యటన పర్యవేక్షించే నేతలకు, సిఎంఒ అధికారులకు తెలియజేశారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో వెలిగొండకు సిఎం చంద్రబాబు వెళితే నిధుల కేటాయింపులపై ఇరకాటంలో పడాల్సి వస్తుందని సిఎంఒ అధికారులు భావించారు. వెలుగొండకు నిధులు ఇవ్వకపోవడంపై సిపిఎం, సిపిఐ, రైతు సంఘాలు, ఇతర పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నందున అందుకు సిఎంఒ అధికారులు అంగీకరించలేదు. మార్కాపురాన్ని జిల్లా చేస్తామని ఎన్నికల పర్యటనలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ విషయం గురించి పట్టించుకోలేదు. ఈ రెండు అంశాలపైనా సిఎం మాట్లాడతారని ఆ ప్రాంత నేతలు, జనంలోనూ ఇప్పుడు చర్చగా మారింది. సభకు వచ్చిన జనం ఈ రెండు అంశాలపై ప్రశ్నించే పరిస్థితి ఉందని అధికారులు గుర్తించారు. దీంతో నిరసనలు తగలకుండా సిఎంఒ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. సిఎం పర్యటనను కేవలం మహిళా దినోత్సవ సభకు పరిమితం చేస్తూ కార్యక్రమాన్ని ఖరారు చేశారు.

మార్కాపురంలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

పాడేరు ఐటిడిఎ ఎదుట దీక్షల్లో కూర్చున్న నాయకులు

1/70పై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలి

- పాడేరులో ఆదివాసీ ఆత్మగౌరవ దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

1/70 చట్టంపై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలంటూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా పాడేరులోని ఐటిడిఎ గేటు ఎదుట రెండు రోజులపాటు తలపెట్టిన ఆదివాసీ ఆత్మగౌరవ నిరాహార దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1/70 చట్టం అమలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల ఆదివాసీలు నష్టపోతున్నారని తెలిపారు. గిరిజనుల హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలన్నారు. జిఒ 3ను పునరుద్ధరిస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిన టిడిపి ఆ మాటకు కట్టుబడి ఉండాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే చెందేలా వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ చట్టాన్ని చేయాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, గిరిజన సలహా మండలి (టిఎసి) ఏర్పాటు చేయాలని, ఆదివాసీ ప్రాంతంలో బినామీ వ్యవస్థ, గిరిజనేతరుల వలస నిరోధక చట్టం చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్‌కు రూ.17 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడాన్ని విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో ఐక్యవేదిక నాయకులు ధర్మాన పడాల్, రాధాకృష్ణ, కొండలరావు, కృష్ణారావు, హైమావతి, ఎస్.చిట్టిబాబు, మంగన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

భూ పోరాటాలకు సిద్ధం కండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బద్వేలు (వైఎస్‌ఆర్ జిల్లా)

వైఎస్‌ఆర్ జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో ఈ నెల 15న నిర్వహించబోయే భూ పోరాటాలకు సిద్ధం కావాలని, సుందరయ్య, అంబేద్కర్ ఆశయ సాధనకు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. 'భూబాధితులు-వలసల నివారణ' అనే అంశంపై బద్వేలులోని ఎన్‌జిఒ హోమ్‌లో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను అధ్యక్షతన గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలోని 15 గ్రామాలు, బ్రహ్మంగారిమఠం మండలంలోని ఐదు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారితో ఎర్రజెండాలు నాటించి భూమి చదును చేస్తామని తెలిపారు. పాలకులు, ఉద్యోగులు పేదల దరఖాస్తులను పరిశీలించి, వారికి డికెటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో 'పేదల ఐక్యవేదిక'లు ఏర్పాటు చేసి 'సామాజిక న్యాయం కోసం' పోరాటాలు ప్రారంభించాలని కోరారు. గ్రామీణ బలహీన శక్తులన్నీ ఐక్యమై బలమైన శక్తులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్ బాషా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని పాల్గొన్నారు.

బ్రిటానియా సిఇఒ రజనీత్ రాజీనామా

న్యూఢిల్లీ : ప్రముఖ బేకరీ అహారోత్పత్తుల సంస్థ బ్రిటానియా ఇండస్ట్రీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) రజనీత్ సింగ్ కోహ్లీ అనుహ్యంగా తన పదవికి రాజీనామా చేశారు. మార్చి 14 తర్వాత ఆయన కంపెనీని వీడనున్నారని బ్రిటానియా సంస్థ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. కంపెనీకి వెలుపల ఇతరత్రా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కోహ్లీ రాజీనామా చేశారని తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో నుంచి సంస్థ సిఇఒగా కోహ్లీ బాధ్యతలు నిర్వహించారు.

ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా మరిన్ని సేవలు

- ట్రస్ట్ భవన శంకుస్థాపనలో భువనేశ్వరి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తామని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. విజయవాడ టీచర్స్ కాలనీలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన నిర్మాణానికి ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ముందుగా బెంజిసర్కిల్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ భవన్ నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. ట్రస్ట్ భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. దీనిలో కార్యాలయం, బ్లడ్ బ్యాంక్, తలసేమియా సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తలసేమియా బాధితుల సహాయాన్ని ఇటీవల విజయవాడలో నిర్వహించిన మ్యూజికల్ నైట్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ స్ఫూర్తితో త్వరలో హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రిల్లోనూ తలసేమియా సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. స్త్రీ శక్తి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న భువనేశ్వరి

అదాని ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న రైతులు

- దెబ్బతింటున్న పండ్ల తోటలు, అడుగంటిపోతున్న నీరు
- ఆదుకోవాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్

ప్రజాశక్తి - తాడిమర్రి

శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలోని దాడితోట, పెద్దకోట్ల, చిల్లకొండయ్య పల్లి గ్రామ సరిహద్దుల్లో నిర్మిస్తున్న అదాని హైడల్ పవర్ ప్రాజెక్ట్ కర్మాగారం వల్ల నష్టపోతున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. పవర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవటానికి సిపిఎం నాయకులు గురువారం తాడిమర్రి మండలంలో పర్యటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాపల్లి పెద్దన్నతో పాటు స్థానిక నాయకులు మండలంలోని దాడి తోట, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు బాధిత రైతులతో మాట్లాడారు. చీనీ, అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఇబ్బందులను నాయకులకు వివరించారు. వందల ఎకరాల్లో ఖర్చు చేసి సాగుచేసిన అరటి, చీనీ తోటలు పంట చేతికొచ్చే సమయంలో కర్మాగారం నిర్మాణ పనుల్లో భాగంగా వస్తున్న దుమ్ము, ధూళి పంటలపై పడి దెబ్బతింటున్నాయని బాధిత రైతులు అరవింద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి నాయకుల వద్ద వాపోయారు. కర్మాగారంలో పెద్ద ఎత్తున రాత్రింబవళ్లు బ్లాస్టింగ్ చేయడంతో ఆ శబ్దాలకు భూమి అదిరి నీటి పొరలు పూడుకుపోతున్నాయని, బోరుబావుల్లో నీరు రావటం లేదని తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... కర్మాగారం నిర్మాణ పనుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాదాపు 20 సంవత్సరాల దాకా ఆదాయం లభించే పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉందన్నారు. ఇక్కడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్, మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. పాలకులు, అధికారులు స్పందించకపోతే బాధిత రైతుల పక్షాన సిపిఎం ఉద్యమ పోరాటానికి సిద్ధమవుతుందని చెప్పారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్, బాషా, ఆదినారాయణ, కదిరెప్ప, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న చీనీ పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

జియోస్టార్‌లో 1100 మంది ఉద్యోగులకు ఎసరు

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు చెందిన వయాకామ్ 18, వాల్ట్ డిస్నీ ఇండియా యూనిట్ల మధ్య కొత్తగా ఏర్పడిన సంయుక్త భాగస్వామ్య సంస్థ జియోస్టార్‌లో 1100 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారని తెలుస్తోంది. నెల రోజుల కిందటే తొలగింపుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఉద్వాసనలు ఇప్పట్లో ముగియవని.. జూన్ వరకు కొనసాగుతాయని సంబంధిత అధికారి ఒక్కరు పేర్కొన్నట్లు జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్, ఫైనాన్స్, కమర్షియల్, లీగల్ విభాగాల్లో తొలగింపులు ఉంటున్నాయి. వేటు పడిన వారిలో ఎంట్రీ లెవల్ ఉద్యోగులు, సీనియర్ మేనేజర్లు, సీనియర్ డైరెక్టర్లు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారు.

వయాకామ్ 18, డిస్నీ స్టార్ ఇండియా విలీనాన్ని దేశంలోనే అతిపెద్ద మీడియా సంస్థ సృష్టిగా ఆ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. రెండు పెద్ద కంపెనీలు ఏకమైనప్పుడు సిబ్బందిపై వేటు ఉంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

కాగా.. ఛాంపియన్స్ ట్రోఫీ, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) వంటి వాటిల్లో పని చేస్తోన్న ఉద్యోగులపై ప్రభావం ఉండదని సమాచారం. 2025లో భారీ లాభాలను ఆర్జించాలని జియోస్టార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే సిబ్బందికి ఎసరు పెడుతోంది. ఉద్యోగం కోల్పోయిన వారికి వారి పదవీకాలాన్ని బట్టి 6 నుంచి 12 నెలల జీతంతో సహా ఇతర ప్యాకేజీలను అందించనున్నట్లు తెలుస్తోంది. బాధిత ఉద్యోగులకు ఒకటి నుంచి మూడు నెలల వరకు నోటీస్ పీరియడ్‌తో పాటు కంపెనీలో పూర్తయిన ప్రతి ఏడాదికి ఒక నెల పూర్తి వేతనం లభిస్తుంది. 2024 నవంబర్‌లో రిలయన్స్‌కు చెందిన వయాకామ్18, స్టార్ ఇండియా మధ్య జాయింట్ వెంచర్‌గా జియో స్టార్ ఏర్పడింది. ఐపిఎల్ 2025 కోసం జియోస్టార్ రికార్డు స్థాయిలో రూ.5,000 కోట్ల ప్రకటనల రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

జెంటిఎం క్యాపిటల్ భారీ పెట్టుబడుల ప్రణాళికలు

హైదరాబాద్ : గ్లోబల్ ప్రయివేట్ ఈక్విటీ సంస్థ జెంటియం క్యాపిటల్ భారత్‌లో ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదన ఇంధనం, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. వచ్చే ఐదేళ్లలో 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.43,550 కోట్లు) వ్యయాలను చేయనున్నట్లు వెల్లడించింది. పూణేలో తన మొదటి కార్యాలయాన్ని ప్రారంభించినట్లు జెంటియం క్యాపిటల్‌లో మేనేజింగ్ పార్ట్‌నర్ అభిషేక్ బాల్ తెలిపారు. దేశంలో మధ్యతరగతి విస్తరిస్తోన్న నేపథ్యంలో ఇక్కడ విశేష అవకాశాలున్నాయన్నారు. తమ పోర్ట్‌ఫోలియోలో 50 శాతం నిధులు ఆరోగ్య సంరక్షణకు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

Gentium Capital
Right finding and right sizing business solutions

The Accountant's General Office Employees Co-operative Housing Society Ltd,
(Regd. No.T.A.68), H. No.:5-9-13, Flat No.201, Taramandal Complex, Saifabad, Hyderabad-500 004.

NOTICE

All the members of the Accountants' General Office Employees Co-operative Housing Society Limited., (Regd. No.T.A.68) are hereby informed that a list of eligible voters is prepared and exhibited on the notice board of the Society. The members are requested to file claims/objections before the undersigned before 15-03-2025 along with the documentary evidences for omission/commission of their names into the list of eligible voters.

Place : Hyderabad
Date : 06-03-2025

Sd/- Chairman/Person Incharge Committee, AG Office Employees CHBS Ltd.

NOTE: The members who have not paid the differential share capital amount of Rs.300/- are also requested to pay the same for inclusion of their name in the eligible voters list.

సిపిఎం నాయకుడు శ్రీనివాస్ రెడ్డి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నాయకులు, మహబూబాబాద్ టూ టౌన్ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు అల్లి శ్రీనివాస్‌రెడ్డి (59) గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు తుది శ్వాస విడిచారు. శ్రీనివాస్ రెడ్డి రెండున్నర నెలల కిందట బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం మృతిచెందారు. శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థి ఉద్యమాల నుంచి కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. మూడు దశాబ్దాలకుపైగా సిపిఎంలో వివిధ స్థాయిల్లో పనిచేశారు. భూ పోరాటాలు, పేదలకు గుడిసెలు వేయించడంలో కీలక పాత్ర పోషించారు. తనకు ఇచ్చిన బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. మహబూబాబాద్ మండలం జమాన్ల పెల్లికి చెందిన అల్లి అనసూర్య- పాపిరెడ్డి దంపతుల కుమారుడైన శ్రీనివాస్ రెడ్డి మానుకోటలో స్థిరపడ్డారు. శ్రీనివాస్ రెడ్డికి భార్య పద్మ, కూతురు స్ఫూర్తి ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మృతదేహాన్ని గురువారం రాత్రి మహబూబాబాద్‌లోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు మహబూబాబాద్‌లో నిర్వహించనున్నారు.

శ్రీనివాస్ రెడ్డి (ఫైల్)

సిపిఎం సంతాపం

అవిశ్రాంత ఉద్యమకారుడు అల్లి శ్రీనివాసరెడ్డి మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ నేతలు సంతాపం తెలిపారు. అల్లి శ్రీనివాస్ రెడ్డి సేవలను కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అన్నప్రసాదంలో వడను వడ్డిస్తున్న టిటిడి చైర్మన్

అన్నప్రసాదంలో అదనంగా 'వడ' : టిటిడి చైర్మన్

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల అన్న ప్రసాదంలో అదనంగా 'వడ'ను జోడించారు. తిరుమల లోని తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో గురువారం టిటిడి ఇఒ జె శ్యామలరావు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరిలతో కలిసి టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు యాత్రికులకు వడ వడ్డింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్న ప్రసాద కేంద్రంలో ఇకపై ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు 35 వేల వడలను వడ్డించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింతగా పెంచి యాత్రికులకు రుచికరమైన భోజనం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతా రామ్, డిప్యూటీ ఇఒలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

అమెజాన్ బిజినెస్ బి2బి డిస్కౌంట్ సేల్

బెంగళూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో బి2బి కస్టమర్ల కోసం డిస్కౌంట్ సేల్‌ను అందిస్తున్నట్లు అమెజాన్ బిజినెస్ తెలిపింది. ఇందులో జిఎస్‌టి ఇన్ వాయిస్‌తో 28 శాతం వరకు ఆదా చేసుకోవచ్చని పేర్కొంది. ఎస్‌బిఐ క్రెడిట్ కార్డుపై అదనంగా 10 శాతం తగ్గింపు పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది. డెల్, హెచ్‌పి, బోట్, జెబిఎల్, పిజియన్ తదితర ప్రముఖ బ్రాండ్స్ ఉత్పత్తులపై 80 శాతం వరకు ధరల తగ్గింపు ఉంటుందని వెల్లడించింది.

నాయిస్ నుంచి టిడబ్ల్యుఎస్ మాస్టర్ బడ్స్

హైదరాబాద్ : ప్రముఖ లైఫ్‌స్టైల్ టెక్ బ్రాండ్ నాయిస్ కొత్తగా బోస్ శబ్దంతో తమ తదుపరి తరం టిడబ్ల్యుఎస్ మాస్టర్ బడ్స్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఒనిక్స్, టైటానియం, సిల్వర్ రంగుల్లో లభించే వీటి ధరను రూ.7,999గా నిర్ణయించింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అభ్యమవుతాయని పేర్కొంది. అధునాతన్ 49డిబి ఎఎన్‌సిని కలిగి ఉన్న నాయిస్ మాస్టర్ బడ్స్ ఆకర్షణీయమైన ఎంపిక కానుందని నాయిస్ కో-ఫౌండర్ అమిత్ ఖత్రి తెలిపారు.

N.A.M.ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్

బహిరంగ ప్రకటన

తేది.08 మార్చి, 2025 00:00 గంటల నుండి వర్తించు తుమ్మలచెరువు టోల్ ప్లాజా (కి.మీ.110 + 200) వద్ద టోల్ రుసుము సవరణపై పబ్లిక్ నోటిఫికేషన్. ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా తేది.23.07.2010నాటి రాయితీ ఒప్పందానికి అనుగుణంగా, లేఖ సంఖ్య: 05032025/F-88/GM/ DCE-1/DEE5/ AEE 24/NAM (PPP)/Toll/2024-25, తేదీ.06.03.2025 ఆధారంగా చీఫ్ ఇంజనీర్ (ఆర్&బి), ఎస్‌హెచ్& మేనేజింగ్ డైరెక్టర్, ఏపిఆర్‌డిసి, 5వ అంతస్తు, (ఆర్&బి) హెచ్‌ఓడి కాంప్లెక్స్, లబ్బీపేట, ఎంజి రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ ద్వారా ఆమోదించిన టోల్ రుసుము మరియు నెం.21, తేది.20.01.2014 ఆధారంగా గెజిట్‌లో ఫీజు నోటిఫికేషన్ ప్రచురణను అనుసరించి, పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం, తుమ్మలచెరువు గ్రామానికి సమీపంలో ఉన్న తుమ్మలచెరువు టోల్ ప్లాజా కిమీ 110+ 200 వద్దఉన్న తుమ్మలచెరువు టోల్ ప్లాజా కోసం 70.110 కిలోమీటర్ల నాలుగు లేన్‌లు, రాష్ట్ర రహదారి-2 కి సంబంధించి 08 మార్చి, 2025న 00.00 గంటల వినియోగానికి యూజర్ ఫీజు రేట్లు దిగువ ధరల వద్ద సవరించబడ్డాయి.

వాహనం రకం	తుమ్మలచెరువు టోల్ ప్లాజా		
	ఒకసారి ప్రయాణం(రూ.)	రోజువారీ పాస్(రూ.)	నెలవారీ పాస్ (రూ.)
కారు/ జీప్/వ్యాన్	77	115	2301
లైట్ కమర్షియల్ వెహికల్ / మినీబస్	153	230	4603
బస్సు/ ట్రక్	307	460	9206
మల్టీ యాక్సెల్ వెహికల్ / హెవీ కన్‌స్ట్రక్షన్ వెహికల్	767	1151	23015

1) స్థానిక వాహనాలకు రాయితీలు (ప్లాజా లొకేషన్ నుండి 20 కి.మీ.ల పరిధిలోకి వస్తాయి):

ఎ) కారు/ జీప్/ వ్యాన్ (వాణిజ్య ప్రయోజనం): ప్లాజా ప్రదేశం నుండి 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు/ పట్టణాలు/నగరాల నివాసితులకు రూ.390/- ఛార్జీతో నెలవారీ పాస్ అందించబడుతుంది. వాణిజ్య ప్రయోజనం కాకుండా ఇతర కార్లకు పూర్తిగా మినహాయింపు వుంటుంది.

బి) ఎల్‌సివి / ట్రక్: 20 కి.మీ లోపల అనగా వాహనం యొక్క తిరుగు వివరాలను స్పష్టంగా పేర్కొంటూ, మొదలు మరియు గమ్యస్థానానికి సంబంధించిన వస్తువుల చలాన్ చెల్లించిన రుజువును సమర్పించిన తర్వాత రాయితీ రుసుము స్థానిక రవాణా ఆపరేటర్ల నుండి చార్జ్ చేయబడుతుంది. అటువంటి రవాణాకు రుసుము ప్రతి ప్రవేశానికి ట్రక్కులకు రూ.65/- మరియు ప్రతి ప్రవేశానికి లైట్ కమర్షియల్ వాహనాలకు రూ.40/- ఉంటుంది.

2) నెం.21, తేది.20.01.2014నాటి గెజిట్‌లో పేర్కొన్న విధంగా వాహనాలకు మినహాయింపు ఉంటుంది.

3) ఓవర్‌లోడ్ వాహనాలకు అదనపు రుసుము:

అటువంటి చట్టాలలో నిర్దేశించబడిన అనుమతించదగిన పరిమితికి మించి లోడ్‌చేయబడిన వాహనాన్ని డ్రైవింగ్‌చేసే ఏ వ్యక్తి అయినా వర్తించే చట్టాల క్రింద కలిగించే బాధ్యతకు పక్షపాతం లేకుండా, రాయితీదారు తన నిర్దేశించిన ప్రకారం అదనపు రుసుమును ("అదనపు రుసుము") తిరిగి పొందవచ్చు అటువంటి ఉపయోగం ద్వారా ప్రాజెక్ట్ హైవేకి కారణమైన క్షీణతకు బదులుగా. అదనపు రుసుము మించకూడదు.

ఎ) సదరు వాహనం యొక్క ఓవర్‌లోడింగ్ అనుమతించదగిన లోడ్‌లో 10%(పదిశాతం) కంటే ఎక్కువ అయితే దానిలో 20% (ఇరవై శాతం) కంటే ఎక్కువ లేకపోతే రుసుములో 50% (యాభై శాతం) మరియు

బి) సదరు ఓవర్‌లోడింగ్ అనుమతించదగిన లోడ్‌లో 20% మించి ఉంటే ఫీజులో 100% (వంద శాతం).

అత్యవసర సేవలకు కోసం సంప్రదించు నెంబరు: +91 9121282530 (తుమ్మలచెరువు టోల్ ప్లాజా)

రిజిష్టర్డు ఆఫీసు: బి-376, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, నిర్మాణ్ విహార్, న్యూ ఢిల్లీ-110092

సంపాదకీయం

మండుతున్న ఎండలు

వేసవి ప్రారంభంతోనే ఎండలు మండిపోతున్నాయి. మార్చి మొదటివారానికే తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని భారత వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణంలో అత్యంత వేగంగా వస్తున్న ప్రతికూల మార్పులు ప్రాణకోటి మనుగడకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. లాభాలే పరమార్థంగా, స్వార్థమే వికాస లక్షణంగా సాగుతున్న పెట్టుబడిదారీ సమాజపు వికృతతత్వానికి ప్రతిఫలన పర్యవసానాలు ఇవి. మున్ముందు కూడా పరిస్థితి ఇలాగే కొనసాగితే మానవ మనుగడకే తీవ్ర ప్రమాదం ముంచుకొస్తుందన్నది పర్యావరణవేత్తల హెచ్చరిక. ఉసురు తీసే తీవ్ర ఉష్ణోగ్రతలు, ముంచెత్తే వరదలు, వాయు విలయాలూ, మంచుతుపానులు ఇప్పటికే భూగోళాన్ని భయకంపితం చేస్తున్నాయి. విచక్షణను విడచి కొండాకోనల్ని, ఆకుపచ్చ అడవుల్ని స్వాహా చేయటమే లక్ష్యంగా సాగుతున్న స్వార్థపరత్వానికి ఇవి ప్రకృతి మోగించే ప్రమాద ఘంటికలు.

వాతావరణంలో వస్తున్న ప్రతికూల మార్పులు ఎండలు పెరగటానికో, శీతల గాలులు శివమెత్తటానికో, అతివృష్టికో అనావృష్టికో పరిమితం కావు. మానవ మనుగడకు సంబంధించిన అన్ని అంశాల మీదా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. కొత్త జబ్బులు ప్రబలటానికి, తీవ్రం కావటానికి; పంట దిగుబడులు తగ్గటానికి, శ్రామికుల పనిదినాలు హరించిపోవటానికి, ప్రగతి మందగించిపోవటానికి కూడా కారణమవుతున్నాయి. భూగర్భ జలాలు దారుణంగా అడుగంటి పోయి, తీవ్ర నీటి ఎద్దడిని సృష్టిస్తున్నాయి. సాధారణంగా వేసవిలో తీవ్రంగా వడగాడ్పులు వీచే రోజులు మనదేశంలో ఒకప్పుడు 4 నుంచి 8 ఉంటే, గత సంవత్సరం 37 నమోదయ్యాయి. ఇండియాలో వడగాడ్పుల తీవ్రత ఏడాదికేడాది పెరుగుతోందని ది లాన్సెట్ అధ్యయనం ఇటీవల తెలియజేసింది. వడగాడ్పు మరణాలు పదేళ్లలో 55 శాతం మేర పెరగాయని కూడా నివేదించింది. భవిష్యత్తులో వేడిగాలుల తీవ్రత, సాంద్రత మరింత పెరుగుతాయని; ఉష్ణ తరంగాలు ఉధృతమవుతాయని ఐఐటి బాంబే, ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా చేసిన పరిశీలన వెల్లడించింది. దక్షిణాసియాలో ఎండల ప్రభావం భారతదేశంలోనే చాలా వేగంగా పెరుగుతోందని కూడా ఆ నివేదిక పేర్కొంది.

మన రాష్ట్రంలో ఎండలు పెరగటానికి ముందే అనేక జిల్లాల్లో నీటిఎద్దడి ఎంత తీవ్రంగా ఉందో వార్తాకథనాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ దుస్థితి ఇంకా తీవ్రతరమవుతుంది. 4,203 గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయని, 2,665 నివాస ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇప్పటికే నివేదించింది. వేసవిలో తాగునీటి కోసం జనం అల్లాడిపోకముందే రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి. ఉన్న నీటివనరులు ఎండిపోతే జనం ఊటగెడ్డలపై ఆధారపడడం, కలుషిత నీరు తాగి అనేక రోగాలకు గురి కావడం ఏటేటా ఏజెన్సీలో పునరావృతమవుతున్న దృశ్యం. దరిమిలా గిరిజన ప్రాంతాలకు రక్షిత నీరు అందివ్వటానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. విద్యార్థులకు పరీక్షల కాలం నడుస్తున్నందున వారు తీవ్ర వేడిమి బారిన పడకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధి హామీ కార్మికులకు చట్టప్రకారం తాగునీరు, నీడ వసతులు కల్పించి, 11 గంటలకు ముందే పనులు ముగించాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఏటా ఉపాధి కార్మికులు, వృద్ధులు ఎండలకు బలవ్వడం సంభవిస్తోంది.

అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల బారిన పడకుండా తక్షణ చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, భూగోళం ఇంతగా మండిపోకుండా దూరదృష్టితో శాశ్వత ప్రణాళిక చేపట్టటం అంతే ప్రధానం. కర్బన ఉద్గారాలను అధికంగా వదిలే అమెరికా, బ్రిటన్ వంటి సంపన్న దేశాలు అలాంటి బాధ్యత నుంచి తప్పించుకొనిపోవడం తీవ్రమైన బాధ్యతారాహిత్యం. వర్ధమాన దేశాలన్నీ పట్టుబట్టి వాటి నుంచి నిధులు రాబట్టాలి. అడవులను నాశనం చేసి, కార్పొరేట్లకు వనరులను దోచిపెట్టే ఉదార విధానాలను మోడీ ప్రభుత్వం విడనాడాలి. ప్రపంచవ్యాప్తంగా కూడా అభివృద్ధి పేరు చెప్పి, పాలకులు, కార్పొరేట్లు విచ్చలవిడిగా సాగిస్తున్న పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలి. చెట్టూ పుట్టా, వాగూ వంకా, కొండా కోనా, చెరువూ దొరువూ క్షేమంగా ఉంటేనే భూగోళం ఆరోగ్యకరంగా ఉంటుంది. భూగోళం చల్లగా ఉంటేనే మానవ మనుగడ కూడా తరతరాల పాటు సజావుగా సాగుతుంది. మండే ఎండల తీవ్రతకు ముకుతాడు వేయాలంటే ఈ ఎరుక చాలా కీలకం!

మహనీయుల మాట

మహిళలను అంధకారం లోను, తెర చాటున ఉంచేసే... మీరు మాత్రం ముందుకు నడవాలనుకోవడం వృథా ప్రయాసే. అదెప్పటికీ జరగదు.

- సిస్టర్ నివేదిత, (బ్రిటన్‌లో పుట్టి భారత్‌లో మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన సంస్కర్త)

రాష్ట్ర బడ్జెట్ 2025-26

కార్పొరేట్లకు మేలు - ప్రజలకు భారాలు

విశ్లేషణ

డా॥ బి. గంగారావు

2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. వాస్తవంగా బడ్జెట్ పద్దు భారీగా ఉన్నా కేటాయింపులు, ప్రాధాన్యతలు, నిధుల సమీకరణ, పన్నుల పెంపు, ఎన్నికల వాగ్దానాల అమలు, ఉపాధి కల్పన తదితర వాటిని పరిశీలిస్తే ప్రజలకు, రాష్ట్రానికి తీవ్ర హాని చేసేదిగా వుంది.

2024-25 సవరించిన బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌కి అదనంగా రూ.48 వేల కోట్ల రాబడి వస్తుందని చూపారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పన్నులైన స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఫీజులు, రాష్ట్ర జిఎస్టి, ఎక్సైజ్ డ్యూటీ, అమ్మకపు పన్ను, వాహన పన్నుల ద్వారా 2024-25 కంటే సుమారు రూ.15 వేల కోట్లు పైగా రాబడి వస్తుందని ప్రతిపాదించారు. అలాగే పన్నేతర ఆదాయం రూ.7218 కోట్ల నుండి రూ.19,119 కోట్లకు పెరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావలసిన పన్నులలో వాటా, వివిధ రకాల గ్రాంట్ల రూపంలో మొత్తం రూ.89,850 కోట్లు వస్తుందని, అప్పు ద్వారా రూ.లక్షా 4 వేల కోట్లు సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు.

ఒక్క లిక్కర్ ద్వారానే రాష్ట్ర ప్రభుత్వం రూ.27 వేల కోట్లకు పైగా ఆదాయం రాబట్టనుంది. రాబోయే కాలంలో రిజిస్ట్రేషన్ చార్జీలు, అమ్మకపు పన్ను, వాహన పన్ను భారీగా పెరగనున్నాయి. అనూహ్యంగా పన్నేతర రాబడిని ఈ ఏడాది అదనంగా రూ.12 వేల కోట్లకు పెంచుకోబోతున్నట్లు చూపించారు. మైనింగ్, భూముల అమ్మకం ద్వారా ఈ ఆదాయాన్ని పొందాలని ప్రతిపాదించారు. ఇది చాలా ఆందోళన కలిగించే అంశం.

కేంద్ర ప్రభుత్వం నుండి ఎక్కువ నిధులు వస్తాయని బడ్జెట్‌లో పేర్కొన్నది. కేంద్ర వివిధ ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులు రూ.10 వేల కోట్లకు పైగా అదనంగా వస్తాయని చూపారు. వాస్తవంగా గత కొన్నేళ్లుగా ఈ గ్రాంట్లు తగ్గిపోతున్నాయి. 2024-25లో ఈ నిధులు కేవలం రూ.21,966 కోట్లకే పరిమితమయ్యాయి. పన్నుల్లో రాష్ట్ర వాటా కూడా బడ్జెట్లో పేర్కొన్నట్లు ఏకంగా రూ.7500 కోట్లు పెరగటానికి అవకాశాలు లేవు. ఈ ఏడాది గతం కంటే కేవలం రూ.1500 కోట్లు మాత్రమే పెరిగాయి.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి న్యాయబద్ధంగా రాష్ట్రానికి రావలసిన నిధులు రాబట్టేకన్నా రాష్ట్రంలో ప్రజలపై పన్ను భారాలు మోపి రాబడి పెంచుకోవాలనే దుర్మార్గపు పద్ధతిని ఎంచుకుంది. స్పెషల్ స్టేటస్ డిమాండ్‌ను కూడా వదిలేసింది. ఇంకోవైపు రాష్ట్రంలో పెట్టుబడిదార్లకు, పారిశ్రామికవేత్తలకు అనేక రూపాల్లో పన్ను రాయితీలు, నిధుల కల్పన చేస్తున్నది. ఫలితంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతున్నా పన్నుల పెరుగుదల రూపంలో అది కనిపించటంలేదు.

ఈ బడ్జెట్లో ఏకంగా లక్షా రూ.4 వేల కోట్ల అప్పులు ప్రతిపాదించించారు. 2024-25లో కూటమి ప్రభుత్వం సుమారు రూ.94 వేల కోట్లు తీసుకొచ్చారు. ఏడాదికి అప్పులపై అసలు, వడ్డీలు కలిపి సుమారు రూ.60 వేల కోట్లు చెల్లించాల్సి వస్తుంది. మొత్తం అప్పు నేడు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 35 శాతానికి ఎగబాకి 4.38 శాతానికి ద్రవ్యలోటు చేరింది.

ఈ ఏడాది సేకరించే రుణాల్లో రాష్ట్ర ప్రభుత్వ అంతర్గత రుణం కింద రూ.81956 కోట్లు, కేంద్రం నుంచి రూ.21700 కోట్లు రుణం వుంది. కేంద్రం నుండి తీసుకోబోతున్న రుణాలన్నీ సంస్కరణలతో, షరతులతో కూడుకున్నవి. గత ప్రభుత్వం కూడా ఈ తరహా అప్పులు తీసుకొచ్చి పట్టణ సంస్కరణలు, కార్మిక చట్టాల్లో మార్పులు, విద్యుత్ సంస్కరణలు, భూ సర్వే వంటివి అమలు చేసి ప్రజలపై భారాలు మోపడంతో పాటు హానికర చర్యలకు పాల్పడింది.

> ప్రజలకు వాగ్దానం చేసిన ఆరు సంక్షేమ పథకాల్లో ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకుండా ద్రోహం చేసింది. మిగిలిన తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, దీపం పథకాలకు అవసరమైన నిధులు కూడా కేటాయించలేదు. పెద్ద సంఖ్యలో అర్హులైన పేదలను వివిధ కారణాలు చూపి ఈ పథకాల నుండి తొలగించడానికి వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు సామాజిక పింఛనుకు సుమారు రూ.32 వేల కోట్లు ఏడాదికి అవసరం. కానీ కేటాయించింది రూ.27,518 కోట్లు మాత్రమే. సుమారు రూ.5 వేల కోట్ల మేర కోత పెట్టారు. ఆ మేరకు పింఛను పొందుతున్న వారిని తగ్గిస్తారు.

> రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి న్యాయబద్ధంగా రాష్ట్రానికి రావలసిన నిధులు రాబట్టేకన్నా రాష్ట్రంలో ప్రజలపై పన్ను భారాలు మోపి రాబడి పెంచుకోవాలనే దుర్మార్గపు పద్ధతిని ఎంచుకుంది. ప్రత్యేక హోదా డిమాండ్‌ను కూడా వదిలేసింది. ఇంకోవైపు రాష్ట్రంలో పెట్టుబడిదార్లకు, పారిశ్రామికవేత్తలకు అనేక రూపాల్లో పన్ను రాయితీలు, నిధుల కల్పన చేస్తున్నది. ఫలితంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతున్నా పన్నుల పెరుగుదల రూపంలో అది కనిపించటంలేదు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ అప్పులు ఎక్కువగా తీసుకొని అనేక రంగాల్లో ప్రైవేటీకరణ విధానాలను వేగంగా అమలు చేయటానికి పూనుకోబోతున్నది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలను, ప్రభుత్వ ఆస్తులను పి4 పేరుతో ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయబోతున్నది.

వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వి.జి.ఎఫ్) అనే ప్రమాదకర విధానాన్ని ఈ బడ్జెట్‌లో ప్రవేశ పెట్టింది. రూ.2000 కోట్ల పెట్టుబడి నిధిని ఏర్పాటు చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నది. రాష్ట్రాలపై కూడా ఒత్తిడి తీసుకొచ్చి నిధులు ఇస్తున్నది. విద్య, వైద్యం, రోడ్లు, మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్తు, విమానాశ్రయాలు, పోర్టులు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో ఈ నిధులను వినియోగిస్తున్నారు. ఈ విధానంలో మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా ప్రైవేట్ రంగంలోనే చేపట్టాలి. వీటిపై సర్వ హక్కులు ప్రైవేట్ సంస్థలకే కల్పించబడతాయి. ఈ సేవలపై ప్రజల నుండి వివిధ రకాల యూజర్ చార్జీలు కూడా వసూలు చేస్తారు. ఈ విధానం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పన నుండి ప్రభుత్వం వైదొలగి ఆ బాధ్యతను ప్రైవేట్ రంగానికి బదిలీ చేయనున్నది.

మూలధన వ్యయ కేటాయింపుల గురించి ఈ ప్రభుత్వం చాలా గొప్పగా ప్రచారం చేస్తున్నది. ఆస్తులు, సంపద సృష్టికి ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశామని చెప్పారు. ఒకవైపు మౌలిక సదుపాయాలన్నీ వివిధ పేర్లతో ప్రైవేట్ సంస్థల పరం చేస్తూ రెండోవైపు మూల ధన కేటాయింపులపై కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. 2024-25లో రూ.32,713 కోట్లు కేటాయించి సవరించిన బడ్జెట్లో రూ.24,072 కోట్లకు కోత పెట్టారు. ఈ బడ్జెట్లో కేటాయించిన రూ.40,636 కోట్లు ఖర్చు చేస్తారనే గ్యారంటీ ఏమీ లేదు. రెండు ప్రభుత్వాల గత చరిత్ర చూస్తే 2014-19 మధ్య కాలంలో సగటున ఏడాదికి రూ.13,865 కోట్లు, వైసిపి పాలనలో రూ.15,632 కోట్లు మాత్రమే మూలధన వ్యయం కింద ఖర్చు చేశాయి. అంచనా వేసిన రాబడి రాకపోతే తప్పనిసరిగా మొదట కోత పడేది ఈ కేటాయింపుల మీదే.

మూలధన వ్యయంలో సాగునీటి ప్రాజెక్టులకు జలవనరుల శాఖ కింద రూ.15,576 కోట్లను కేటాయించారు. ఇందులో పోలవరానికి రూ. 6705 కోట్లు కేటాయించారు. ఇది కేంద్ర ప్రభుత్వం నుండి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తున్నది. మరో ముఖ్యమైన కేటాయింపు అమరావతి రాజధాని. దీనికి రూ.6000 కోట్లు కేటాయించారు. మిగిలిన మూలధన కేటాయింపుల్లో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణకు ముడిపెట్టి ఇచ్చే రుణాలు, సంస్కరణలతో కూడిన గ్రాంట్లు ఉన్నాయి. అలాగే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా చేపట్టే నిధులు కూడా కలిసి ఉన్నాయి.

ప్రాధాన్యతలు లేకపోవడం, పాలకుల నిర్లక్ష్యం వలన వివిధ నీటి ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి వినియోగంలోకి రాకుండా పోతున్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్లు రాష్ట్రంలో సంపద సృష్టి కాకపోగా ప్రాంతీయ ఆర్థిక వ్యత్యాసాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ బడ్జెట్లో కూడా ఈ ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగించింది. పోలవరం చుట్టూ తిప్పుతూ వెనకబడిన ప్రాంతాల్లో ఉన్న పెండింగ్ నీటి ప్రాజెక్టులకు సత్వరం పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించలేదు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సముద్ర తీరంలో ప్రభుత్వ పెట్టుబడులు, సహకార రంగానికి తోడ్పాటు, పెరుగుతున్న పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సామాజిక రంగంలో విద్యా, వైద్య రంగాలను తీవ్ర నిర్లక్ష్యం చేసింది.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా గత ప్రభుత్వం మీద నెపం మోపుతూ దారుణ వంచనకు పాల్పడింది. ముఖ్యంగా గత బడ్జెట్లో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదు సరికదా ఈ బడ్జెట్లో కూడా కొన్నిటికి ఎగనామం పెట్టింది. సంక్షేమ పథకాల అమలులో ఈ ప్రభుత్వం నయా ఉదారవాద బుద్ధిని విడనాడలేదు. ఈ పథకాల అమలులో రెండు హానికర పద్ధతులను ఈ బడ్జెట్లో అనుసరించింది. ప్రజలకు వాగ్దానం చేసిన ఆరు సంక్షేమ పథకాల్లో ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకుండా ద్రోహం చేసింది. మిగిలిన తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, దీపం పథకాలకు అవసరమైన నిధులు కూడా కేటాయించలేదు. పెద్ద సంఖ్యలో అర్హులైన పేదలను వివిధ కారణాలు చూపి ఈ పథకాల నుండి తొలగించడానికి వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు సామాజిక పింఛనుకు సుమారు రూ.32 వేల కోట్లు ఏడాదికి అవసరం. కానీ కేటాయించింది రూ.27,518 కోట్లు మాత్రమే. సుమారు రూ.5 వేల కోట్ల మేర కోత పెట్టారు. ఆ మేరకు పింఛను పొందుతున్న వారిని తగ్గిస్తారు. అలాగే ఇతర సంక్షేమ పథకాల్లో ఉన్న అర్హులను కూడా అనర్హులుగా వేటు వేస్తారు.

రైతులు పండించే పంటలకు తగిన మద్దతు ధర కల్పనకు ధరల స్థిరీకరణ నిధి కింద కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది అత్యంత దారుణమైన వివక్షత. కనీసం రూ.3 వేల కోట్లయినా కేటాయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ఈ ప్రభుత్వానికి తలకెక్కలేదు.

ఇప్పటికే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేర ప్రభుత్వం 'పి 4' సర్వే నిర్వహిస్తున్నది. ఈ సర్వే ఆధారంగా పెద్ద సంఖ్యలో వివిధ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను పేదల జాబితా నుండి తొలగించనున్నారు. అలాగే పేదరిక నిర్మూలనకు ఈ బడ్జెట్లో తగిన విధంగా నిధులు కేటాయించలేదు. 2047 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా మారుతుందనే ప్రచారంతో ఈ ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్నది. సమాజంలోని 10 శాతం మంది అత్యంత సంపన్నులు, అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకొని పేదరికం నుండి విముక్తి చేయాలననే కొత్త సిద్ధాంతాన్ని తీసుకొచ్చి సామాజిక బాధ్యత నుండి వైదొలుగుతున్నది.

ఈ బడ్జెట్ నిరుద్యోగులకు తీవ్ర ద్రోహం చేస్తున్నది. ఖాళీ పోస్టుల భర్తీకి నిధుల కేటాయింపు లేదు. ఆఖరికి ప్రభుత్వం ప్రకటించిన డి.ఎస్.సి పోస్టుల భర్తీకి కూడా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేకపోవడం శోచనీయం. నిరుద్యోగ భృతికి మొండి చేయి చూపింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కూడా తగిన విధంగా నిధులు కేటాయించలేదు. పైపెచ్చు ఈ నిధులను కూడా కూలీలతో నిమిత్తంలేని ఇతర గ్రామీణ పనులకు మళ్లించటానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగం తెలియజేస్తున్నది. ఇప్పటికే ఆంధ్ర రాష్ట్రంలో ఈ పథకంలో గత నాలుగేళ్ల కాలంలో జాబ్ కార్డుల సంఖ్య 94 లక్షల నుండి 68 లక్షలకు తగ్గిపోవడంతో పాటు సగటు పని దినాలు కూడా 43 రోజులకు పడిపోయింది.

గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసింది. కనీసం నాల్గవ ఆర్థిక సంఘం నిర్దేశించిన అరకొర నిధులను కూడా బడ్జెట్లో కేటాయించటానికి నిరాకరించింది. వాస్తవంగా రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల రాబడిలో కనీసం 30 శాతం (రూ.32 వేల కోట్లు) కేటాయించాలి. కానీ గత అనేక సంవత్సరాలుగా రాష్ట్ర బడ్జెట్ నుండి రాష్ట్ర ఆర్థిక సంఘం సూచించిన కొద్దిపాటి నిధులు, గ్రాంట్లను కూడా కేటాయించకుండా స్థానిక సంస్థలను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు.

ఇక ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలకు కేటాయింపులు, పి.ఆర్.సి ఊసే లేదు. లక్షల సంఖ్యలో ఉండి అతి తక్కువ వేతనాలు పొందుతున్న స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కన్సాలిడేటెడ్ ఉద్యోగుల వేతనాల పెంపు ప్రస్తావన కూడా లేదు. ఇక ప్రైవేట్ రంగంలో పని చేసే కార్మికుల కనీస వేతనాల పెంపు, సంక్షేమ బోర్డులు, సామాజిక భద్రత తదితర వాటికి సంబంధించిన ఏ ఒక్క అంశమూ బడ్జెట్లో లేదు. కార్మికుల పట్ల ఈ ప్రభుత్వం అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్నది.

ఈ బడ్జెట్ ప్రజల ఆదాయాలను, కొనుగోలు శక్తిని తీవ్రంగా దెబ్బతీయనుంది. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడకపోగా ఆర్థిక, సామాజిక అసమానతలు, నిరుద్యోగం పెరగటానికి, ప్రభుత్వ ఆస్తులు, సహజ సంపద కొద్ది మంది చేతుల్లో పోగు పడటానికి దారితీస్తుంది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

చట్టసభలో ప్రతిపక్షం-ప్రతిపక్ష నాయకుడు- నిబంధనలు

వ్యాఖ్య





గుమ్మడిదల రంగారావు

> పాలక పక్షానికి కూడా జగన్‌కి ప్రతిపక్ష నేత హోదా ఇస్తే వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. జగన్ అడిగే హోదా ఇచ్చినట్లయితే పాలకపక్షం పెద్ద మనసుకి నిదర్శనంగా ఉండేది. కానీ సభ లోపలగానీ వెలుపల గానీ ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయానికి, సుహృద్భావ వాతావరణానికి చోటేది? ఇక్కడ నష్టపోయేది ప్రజలు. తనకు 40 శాతం ఓట్లు వేసిన ప్రజల పక్షాన పోరాడాల్సిన సమయంలో హోదా ఇవ్వలేదనే వంకతో అసెంబ్లీకి రాకపోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. తనను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలకు ఏమి చెబుతారు? వారి సమస్యలను సభలో ఎవరు ప్రస్తావిస్తారు? ప్రభుత్వ తప్పిదాలను ఎవరు నిలదీస్తారు?

ఎ.పి అసెంబ్లీలో జగన్ మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చే అంశం మీద ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయం మీద చరిత్ర లోకి వెళితే ఆసక్తికర సంగతులు తెలుస్తాయి. జగన్‌కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలా వద్దా అనేది రాజకీయ నిర్ణయం. ఈ విషయంలో పార్లమెంటరీ సంప్రదాయాలు ఏం చెబుతున్నాయో పరిశీలించుదాం.

పార్లమెంటులో రాజకీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే కొన్ని నిబంధనలు పాటించాలి. రాజకీయ పార్టీగా గుర్తింపు పొందితే, ఆ పార్టీ పార్లమెంటు ప్రాంగణంలో కొన్ని వసతులు పొందడానికి వీలుంటుంది. ఇటువంటి గుర్తింపు సభాపతి నుంచి వస్తుంది. ఎన్నికల సంఘం దగ్గర రాజకీయ పార్టీగా నమోదు చేసుకొని ఎన్నికల్లో పోటీ చేస్తాయి రాజకీయ పార్టీలు. అటువంటి పార్టీలకు చట్టసభలో ఒక సీట్ వున్నా అవి పార్లమెంటులో రాజకీయ పార్టీలుగానే కొనసాగుతాయిగానీ సభాధ్యక్షుడి గుర్తింపు వుండదు. సభాధ్యక్షుడి గుర్తింపు పొందితేనే సభా ప్రాంగణంలో కార్యాలయానికి గది కేటాయింపు వంటి వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. స్పీకర్ ఆధ్వర్యంలో పనిచేసే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశాలకు పిలుపు వస్తుంది. వసతుల కల్పనకు నిబంధనలు వేరుగా ఉంటాయి. దీనికి సంబంధించి పార్లమెంటులో మూడు నిబంధనలు పొందుపరిచారు.

మొదటిది: ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ఎన్నికల్లో పోటీ చేసి ఉండాలి. రెండవది: పార్లమెంటు లోపల, వెలుపల ఒక వ్యవస్థ కలిగి ఉండాలి. మూడవది: సభలో రాజకీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే కోరమ్‌కి కావలసిన సంఖ్యకి సమానమైన సంఖ్య కలిగి ఉండాలి. కోరమ్ అంటే సభ జరగటానికి కావలసిన కనీస సభ్యుల సంఖ్య. సభలో వుండే సభ్యుల మొత్తం సంఖ్యలో కనీసం పదో వంతు సభ్యులు హాజరు అయితేనే సభ జరుగుతుంది. ఆ కనీస సంఖ్యనే కోరమ్ అంటారు. కోరమ్ లేదని ఏ సభ్యుడైనా సభాధ్యక్షుడి దృష్టికి తీసుకువస్తే సభా కార్యకలాపాలను అంతటితో ఆపి సభను వాయిదా వెయ్యాలి. అది కోరమ్‌కు వున్న ప్రాముఖ్యత. ఇవి లోక్‌సభలో అమలులో వున్న నిబంధనలు. 'డైరెక్షన్స్ ఆఫ్ ది స్పీకర్' అనే ప్రచురణలోని 120, 121 అధికారణాలలో వీటిని చూడవచ్చు.

అయితే ప్రతిపక్ష నేతకు సంబంధించి 1977లో చేసిన చట్టంలో అటువంటి నిబంధన ఏదీ లేదు. కనీస సంఖ్య అనే నిబంధన ఏదీ లేదు. ఇది2014లో బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి ఆ మాత్రం గౌరవం ఇవ్వటానికి ఇష్టం లేక తెరపైకి తెచ్చిన వాదన. ఆ నిర్ణయం ఫలితంగా పది సంవత్సరాలు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అన్న వ్యవస్థ లేకుండా గడిచింది. 2014లోనూ, 2019 లోనూ కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటికీ దానికి పదో వంతు సంఖ్యా బలం లేదు. పదో వంతు సంఖ్యా బలం లేనప్పుడు ప్రతిపక్ష గ్రూప్‌గా గుర్తిస్తారుగాని ప్రతిపక్ష పార్టీగా గుర్తించక పోవటం గతంలో కూడా జరిగింది. 1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్షంగా ఏ జాతీయ పార్టీ నిలువలేదు. ప్రాతీయ పార్టీ అయిన తెలుగు దేశానికి ప్రతిపక్ష గ్రూప్ అన్న గుర్తింపు దక్కింది.

అయితే చట్టంలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాలంటే పదో వంతు సభ్యులుండాలన్న నిబంధన ఏదీ లేదు. 1977కి ముందు గుర్తింపు పొందిన ప్రతిపక్షం అనే వ్యవస్థ మన పార్లమెంటులో లేదు. గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకుడు అనే హోదా కూడా లేదు. అధికార పార్టీని వ్యతిరేకించేవారు అందరూ ప్రతిపక్ష నాయకులే. 1977లో మొదటిసారి ప్రతిపక్ష నాయకుడు అనే వ్యవస్థ ఏర్పడింది చట్టం ద్వారా. అయితే 1977లో అప్పటి జనతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపునకు కనీస సభ్యుల సంఖ్యను సూచించలేదు. సభలో అధికార పార్టీని వ్యతిరేకించే పార్టీలలో ఎక్కువమంది సభ్యులుండే పార్టీనేతను ప్రతిపక్ష నేతగా సభాధ్యక్షులు గుర్తిస్తారు అని పేర్కొన్నది. సభలో అధికార పక్షాన్ని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు సమాన సంఖ్యా బలం కలిగి వుంటే ఏ పార్టీ నేతను ప్రతిపక్ష నాయకుడుగా గుర్తించాలనేది ఆ యా పార్టీల స్థితిగతుల ఆధారంగా సభాధ్యక్షుడు నిర్ణయిస్తారు. ఆ విధంగా సభాధ్యక్షుడి గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతకు కొన్ని సదుపాయాలు కల్పిస్తారు సభ లోపల వెలుపలా కూడా. జీత భత్యాలు, వాహనం, సహాయ సిబ్బంది, అధికారిక నివాసం మొదలైనవి. ప్రతిపక్ష నేతకు కాబినెట్ మంత్రి హోదా కల్పించటం ఒక సంప్రదాయంగా వస్తున్నది మన వ్యవస్థలో.

అయితే ఇక్కడ ముఖ్యమైన అంశం ఏమిటంటే ఒక పార్టీకి చట్టసభలో గుర్తింపు పొందటానికి అవసరమైన సభ్యులే లేకపోతే, అలాంటి పార్టీ నాయకుడికి ప్రతిపక్ష హోదా ఇచ్చే ప్రసక్తే లేదనేది 2014లో నాటి లోక్‌సభ స్పీకర్ తేల్చేశారు. ఇది రాజకీయపరమైన నిర్ణయం. ఈ వాదన 2014లో తెర మీదకు వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పదో వంతు సభ్యులు కూడా లేరు. కాంగ్రెస్ పార్టీ దానిమీద ఏమీ రాద్ధాంతం చెయ్యలేదు. సభా కార్యకలాపాలకు దూరంగానూ లేదు. ప్రతిపక్ష నాయకుడిని సంప్రదించవలసిన ప్రతి సందర్భంలోను అప్పుడు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరిని ప్రభుత్వం సంప్రదించింది. రాజ్యాంగబద్ధమైన పదవులకు నియామకాలు చేసే కమిటీలో ప్రతిపక్ష నేత కూడా సభ్యుడు. ఉదాహరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి నియామకం. అటువంటి నియామకాలప్పుడు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధీర్ రంజన్ చౌదరిని సంప్రదించింది.

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే పాలక పక్షం సుముఖంగా లేదని తెలిసికూడా ప్రతిపక్షనేత హోదా కావాలని పట్టుబట్టడం అసమంజసం. తనకు దక్కదని తెలిసి కూడా ఆ హోదా కోసం ఆరాటపడటం హుందాతనం అనిపించుకోదు. ప్రతిపక్షనేత హోదా వున్నందువలన ప్రత్యేకంగా ఒరిగేదేమీ లేదు. సభలో మాట్లాడటానికి కేటాయించే సమయం రాజకీయ పక్ష సభ్యుల సంఖ్యాబలం మీద ఆధారపడి ఉంటుంది. మాట్లాడే హక్కు ప్రతి సభ్యుడికీ ఉంటుంది. ఎంతసేపు అనేది సభాపతి నిర్ణయం. ప్రతిపక్షనేత గనుక కచ్చితంగా ఇంత సమయం కేటాయించాలి అన్న నిబంధన ఏమీ లేదు. పాలక పక్షానికి కూడా జగన్‌కి ప్రతిపక్ష నేత హోదా ఇస్తే వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. జగన్ అడిగే హోదా ఇచ్చినట్లయితే పాలకపక్షం పెద్ద మనసుకి నిదర్శనంగా ఉండేది. కానీ సభ లోపలగానీ వెలుపల గానీ ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయానికి, సుహృద్భావ వాతావరణానికి చోటేది? ఇక్కడ నష్టపోయేది ప్రజలు. తనకు 40 శాతం ఓట్లు వేసిన ప్రజల పక్షాన పోరాడాల్సిన సమయంలో హోదా ఇవ్వలేదనే వంకతో అసెంబ్లీకి రాకపోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. తనను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలకు ఏమి చెబుతారు? వారి సమస్యలను సభలో ఎవరు ప్రస్తావిస్తారు? ప్రభుత్వ తప్పిదాలను ఎవరు నిలదీస్తారు?

(వ్యాసకర్త లోక్‌సభ సచివాలయంలో మాజీ డైరెక్టర్)

★

చిత్ర లేఖనం పోటీలను ప్రారంభించి పరిశీలిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

మహిళాభ్యున్నతి ద్వారానే అభివృద్ధి సాధ్యం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మహిళల అభ్యున్నతి ద్వారానే అభివృద్ధి సాధ్యమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంబివికె, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, సేఫ్, తరుణి తరంగాలు, భారత మహిళా మండలి, జనశిక్షణా సంస్థాన్, స్పహాప్తి, సమన్విత సంయుక్త ఆధ్వర్యాన గురువారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో చిత్రలేఖనం, అభ్యుదయ గీతాలు, కవితల పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీలను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లోనూ ముఖ్య భూమిక పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలు వచ్చినపుడు తప్పనిసరిగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని తెలిపారు. యుఎస్ఎ హెల్త్‌కేర్ ఎకనమిస్ట్ పాలపర్తి ఇంద్రాణి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు తప్పనిసరిగా సమయం కేటాయించాలన్నారు. ఎంబివికె బాధ్యులు కె.స్వరూపరాణి మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఇంకా అసమానతలు, వివక్ష కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అధిగమించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. చిత్రలేఖనం పోటీలకు ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు రమేష్, గిరిధర్, చిత్రం సుధీర్, పాటల పోటీలకు స్వరలయ ప్రభాకర్, సూర్యకామేశ్వరి, కవితల పోటీలకు అనిల్ డ్యాని, వడ్లమూడి పద్మ, వైష్ణవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు పి.విజయ, పావని, గీత, నందిని, సేఫ్ బాధ్యులు ఉషా రాణా, శేషు, తరుణీతరంగాలు బాధ్యులు శ్రీదేవి, జనశిక్షణా సంస్థాన్ బాధ్యులు పూర్ణిమ, వన్‌ఎర్త్ వన్ లైఫ్ బాధ్యులు లీలాకుమారి, భారత మహిళా మండలి బాధ్యులు సూర్యకామేశ్వరి, సమన్విత బాధ్యులు వడ్లమూడి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత వారోత్సవాలకు అపూర్వ స్పందన

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 1 నుంచి 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మహిళా సాధికారికత వారోత్సవాలకు మహిళలు, బాలికలు, విద్యార్థినుల నుంచి మంచి స్పందన వస్తోందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
(DEPARTMENT OF FINANCIAL SERVICES, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21, Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam - 530020.

DEMAND NOTICE
(Notice Under Sections 25 to 28 of the Recovery of Debts & Bankruptcy Act, 1993 And Rule 2 of Second Schedule to the Income Tax Act, 1961)
R.P.No. 168 of 2023 in OA No.39 of 2022
Union Bank of India, SSI Branch, Vijayawada, Krishna District
Versus
M/s The Hindustan Automobiles & others

To
(CD-1) M/s. The Hindustan Automobiles represented by its Managing Partner Sri Surinder Singh, S/o. Sri Sardar Singh Sahni, Plot No.127, Block No.C-4, Kamineni Hospital Road, New Autonagar, Kanuru, Vijayawada, Krishna District, Andhra Pradesh - 520007.
(CD-2) M/s. The Hindustan Automobiles represented by its Partner Smt. Taranjit Kaur Sahni, W/o. Sri Surinder Singh Sahni, Plot.No.127, Block No.C-4, Kamineni Hospital Road, New Autonagar, Kanuru, Vijayawada, Krishna District, Andhra Pradesh - 520007.
(CD-3) Sri Surinder Singh Sahni, S/o. Sri Sardar Singh Sahni, Plot No.127, Block No.C-4, Kamineni Hospital Road, New Autonagar, Kanuru, Vijayawada, Krishna District, Andhra Pradesh - 520007.
(CD-4) Smt. Taranjit Kaur Sahni, W/o. Sri Surinder Singh Sahni, Plot No.127, Block No.C-4, Kamineni Hospital Road, New Autonagar, Kanuru, Vijayawada, Krishna District, Andhra Pradesh - 520007.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/39/2022** an amount of **Rs.12,34,09,255.89Ps/- (Rupees Twelve Crore Thirty Four Lakh Nine Thousand Two Hundred Fifty Five And Paisa Eighty Nine Only)** along with pendentellite and future interest @ 11.35% p.a. with monthly rests w.e.f.**24/12/2021** till realization and costs has become due against you (Jointly and severally/ Fully/Limited).
2) You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3) You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4) You are hereby ordered to appear before the undersigned on 15-4-2025 at 10:30 a.m. for future proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
Given under my hand and the seal of this Tribunal on this date: 10/12/2024.
(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

FORM NO. 14
[See Regulation 33(2)]
OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21, Narayana Bhavanam, Saibaba Street, Daba Gardens, Visakhapatnam - 530 020

DEMAND NOTICE
NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.
RC/83/2024 04.03.2025
Central Bank of India, Guntur Branch ,Kothapet,Guntur District
Versus
M/s Sri Kanaka Mahalakshmi Syndicate & others
To, **(CD-1)M/s Sri Kanaka Mahalakshmi Syndicate** Rep.by its Managing Partner Sri.A Peda Koti Reddy 449/C,Pulladigunta,Prathipadu Mandal,Guntur District
(CD-2) Sri. A Peda Koti Reddy S/o Yogi Reddy, D.No.20-10-6/14, K.B.K.R. Complex, Etukuru Road, Guntur District
(CD-3) Smt. A Mangamma, W/o Sri. A Peda Koti Reddy. D No. 20-10-6/14, K.B.K.R Complex, Etukuru Road, Guntur District
1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/702/2019** an amount of **Rs. 1,14,40,518/-** (Rupees one crore Fourteen Lakhs forty thousand five hundred and eighteen only) along with pendentallite and future interest @ 10.10% p.a compounded with monthly rests from **12.07.2019** till realization / date of payment and the costs become due against you (Jointly and severally /Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordence with the Recovery of Debts Due to Banks and Financial Instituition Act 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **08/04/2025 at 10:30 a.m.** For further proceedings.
5. In addition to the sum aforesaid, you will be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to Rule 16 of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:
16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.
(Given under my hand and the seal of the Tribunal , **Visakhapatnam** on this day **04 th March 2025**)
(Avasarala Anil)
RECOVERY OFFICER
Debts Recovery Tribunal, Visakhapatnam

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A. No.998 OF 2024
Between :
M/s. HDFC Bank Ltd, Rep, by its Authorized Officer, Office at D.No.50-96-5, Plot No.175, Opp. Old SBH, Near NRI Hospital, Seethammadhara, Visakhapatnam ... APPLICANT
And
1. **M/s. Excel Implants, Rep. by its partners,** D.No.4-119, 2nd Floor, High School Road, Ramavarappadu, Vijayawada-521108.
2. **M/s.Sri Venkata Ramana Medical Agencies,** D.No.1/24, Lethapalli Village, Kamalapuram, Kadapa, Andhrapradesh-516289.
3. **Mr. Vemireddy Raja Ramesh Reddy,** Flat No.401, Raja Residency, Rajula Bazar, Ramavarappadu, Vijayawada, Krishna Dist, Andhrapradesh-521108.
4. **Mrs. Vemireddy Sandhya Rani,** Flat No.401, Raja Residency, Rajula Bazar, Ramavarappadu, Vijayawada, krishna Dist, Andhrapradesh-521108.
... DEFENDANTS
SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANTS NO. D2 & D4 BY WAY OF PAPER PUBLICATION
D1. **M/s. Excel Implants, Rep. by its partners,** D.No.4-119, 2nd Floor, High School Road, Ramavarappadu, Vijayawada-521108.
D2. **M/s.Sri Venkata Ramana Medical Agencies,** D.No.1/24, Lethapalli Village, Kamalapuram, Kadapa, Andhrapradesh-516289.
D3. **Mr. Vemireddy Raja Ramesh Reddy,** Flat No.401, Raja Residency, Rajula Bazar, Ramavarappadu, Vijayawada, krishna Dist, Andhrapradesh-521108.
D4. **Mrs. Vemireddy Sandhya Rani,** Flat No.401, Raja Residency, Rajula Bazar, Ramavarappadu, Vijayawada, krishna Dist, Andhrapradesh-521108.
... DEFENDANTS
1. WHEREAS, the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m or at such time immediately thereafter according to the convenience of Tribunal on **25/03/2025.** You are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader / Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.
Given under my hand and the seal of this Tribunal on this the 06sth day of March, 2025
Signature of the Officer Authorized to Issue Summons

SBFC | ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్
రిజిష్టర్డు ఆఫీసు : యూనిట్ నెం.103, మొదటి అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, చాకల విలేజ్, అంధేరి -కుర్లా రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి- 400059.

స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(2) ప్రకారం)

ఏదైతే క్రింది సంతకందారులు **ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాల ద్వారా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ముట్టిన తేదీ నుంచి 60 రోజుల్లోపు బకాయిలను తిరిగి చెల్లించాలని కోరుతూ డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగింది.
రుణగ్రహీతలు/ సహరుణగ్రహీతలు బకాయిలను తిరిగిచెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతలకు/ సహరుణగ్రహీతలకు మరియు సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువపేర్కొన్న అధీకృత అధికారి దిగువ పేర్కొన్న తేదీలపై సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది.
ఇందుమూలంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలకు ప్రత్యేకించి మరియు సమస్త ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలను నిర్వహించొద్దు మరియు లావాదేవీలు జరపదలచిన **ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్** ఛార్జ్‌కు లోబడి ఉంటాయని తెలియజేయనైనది.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు & చిరునామా & డిమాండ్ నోటీసు తేదీ & రుణ ఖాతా నెం.	ఆస్తి/(ల) యొక్క వివరణ & స్వాధీనతా తేది	స్వాధీనతా నోటీసులో పేర్కొన్న బకాయిఉన్న మొత్తం
1.	1) కొప్పారావురి కిషోర్ కుమార్, 2) కొప్పారావురి సౌజన్య, డోర్ నెం.280, పాత డోర్ నెం.1-280, ఆగిరిపల్లె, సగ్గూరు, వైఎస్ఆర్ ప్లాంట్ ఎదురుగా, కృష్ణా జిల్లా, విజయవాడ -521211. **డిమాండ్ నోటీసు తేదీ: 12 డిసెంబర్, 2023** **రుణ ఖాతా నెంబరు: 537557 (పిఆర్00379364)/ 'ఆర్ఎంఇ0537557 (పిఆర్00865145)**	సగ్గూరు గ్రామం, ఆగిరిపల్లి మండలం, కృష్ణా జిల్లా మరియు ఎస్ఆర్ఓ నూజివీడు పరిధిలోని ఆర్.ఎస్.నెం.128/6 లోగల డోర్‌నెం.1-280 కలిగిన 580చ.గ.లు లేదా 485.79 చ.మీ.ల విస్తీర్ణపు స్థలం కలిగిన ఆస్తి మొత్తం భాగం, డాక్యుమెంట్ నెం.1249/2014 ప్రకారం దిగువ సరిహద్దులు: **తూర్పు:** ముల్లంగి యోబుకు చెందిన ఆస్తి, **పడమర:** జిల్లా పరిషత్ రోడ్డు, **ఉత్తరం:** రాజులపాటి నాగేశ్వరరావుకు చెందిన ఆస్తి, **దక్షిణం:** ఆర్ & బి రోడ్డు. **స్వాధీనతా తేది: 4 మార్చ్, 2025**	**11 డిసెంబర్, 2023** నాటికి **రూ.22,92,226/-** (రూపాయలు ఇరవైరెండు లక్షల తొంబైరెండువేల రెండువందల ఇరవైఆరు మాత్రమే)

సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులోవున్న సమయానికి సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నియమాల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ సం/- (అధీకృత అధికారి)
తేది: 07-03-2025 ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్

ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : నెం. హెచ్.948, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002. ఫోన్ : 0866-2433379, 2436365

స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (అమలు) రూల్స్, 2002లోని రూల్ 8(6)కి సంబంధించిన నిబంధనతో చదవబడింది. ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి "ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు) మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, బ్యాంక్ అధీకృత అధికారి స్వాభావిక స్వాధీనం చేసుకొని బకాయి వసూలు చేసుకొనుటకు క్రింద ఆస్తిని "ఎక్కడ ఎలా ఉన్నదో", "ఏది ఎలా ఉన్నదో" మరియు "ఏదైతే ఎలా ఉన్నదో అది అలానే" ప్రాతిపదిన అమ్ముటకు నిర్ణయించడమైనది.

1 **రుణగ్రహీతల వివరాలు: ప్రధాన రుణగ్రహీత : మోత్రపు విజయ్ కుమార్,** తండ్రి : వెంకటేశ్వరరావు. **డిమాండ్ నోటీసు తేదీ:** 15/05/2023 బకాయి మొత్తం ది.30.04.2023 నాటికి రూ.8,83,121/- మరియు తదుపరి వడ్డీతో సహా. **పటమట బ్రాంచ్** యొక్క లోన్ నంబర్: **022213004864**లో. **ఆస్తి వివరణ:** మోత్రపు విజయ్ కుమార్. డోర్ నెం.10-85, అంబేద్కర్ కాలనీ, పాత హరిజనవాడ, పెనమలూరు - 521139, కృష్ణా జిల్లా. కంకిపాడు సబ్ రిజిస్ట్రీ పరిధిలో అసెస్‌మెంట్ నెం.2784. సర్వే నెం.238లో 78 చదరపు గజాల విస్తీర్ణంలో ఆర్‌సిసి భవనం. **హద్దులు:** తూర్పు:- మోత్రపు సరస్వతి రావు, దక్షిణం:- సెలిసెల ఆంథోనీ & అదర్స్ ఆస్తి, పశ్చిమం:- మోత్రపు అమ్మయ్య, ఉత్తరం:- పంచాయతీ రోడ్డు. **రిజర్వు ధర: రూ.5,00,000/- (అక్షరాల ఐదు లక్షలు మాత్రమే) మరియు ధరావత్తు సొమ్ము రూ.50,000/- (అక్షరాల యాభై వేల రూపాయలు మాత్రమే)**గా నిర్ణయించటమైనది. **వేలం తేది & సమయం:** మెయిన్ బ్రాంచ్‌లో ది.18-03-2025, ఉ॥11:00గం॥లకు.

2 **రుణగ్రహీతల వివరాలు: ప్రధాన రుణగ్రహీత: సూరపనేని అనిల్ కుమార్, S/o** శివాజీ రావు (లేట్). **2. సహ రుణగ్రహీత: సూరపనేని కనక దుర్గ,** W/o సూరపనేని అనిల్ కుమార్ **డిమాండ్ నోటీసు తేదీ:** 27-05-2024. **బకాయి మొత్తం రూ.10,41,855/-** ది.1.05.2024 నాటికి తదుపరి వడ్డీతో పాటు. హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ నందలి **లోన్ నెం. 06-2213-000282**లో పూర్తిగా చెల్లించే వరకు. **ఆస్తి వివరణ:-** ఆస్తి హోల్డర్: సూరపనేని అనిల్ కుమార్, డోర్ నెం.6-43/C, సాయిబాబా టెంపుల్ దగ్గర, కొత్త వేలేరు, బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా-521105. సర్వే నెం.266/6లో 232 చదరపు గజాల స్థలంలో ఆస్తి RCC బిల్డింగ్‌ను కలిగి ఉంది. అసెస్‌మెంట్ నం.539. కనుమోల్ సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.1338/2014& MD/MODT: 803/2016. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- పంచాయతీ రోడ్డు (38 అడుగులు), దక్షిణం:- పొట్లూరి నారాయణరావు (55 అడుగులు), పశ్చిమం :- సూరపనేని శివ రాణి సూరపనేని కిరణ్ శేఖర్ దాఖలు చేసిన (38 అడుగులు) మరియు పంచాయితీ బజారు, ఉత్తరం:- సూరపనేని శివరాణికి ఇచ్చి మార్గం 4 గజాల వెడల్పు మార్గం (55 అడుగులు). **రిజర్వు ధర: రూ.18,00,000/- (అక్షరాల పద్దెనిమిది లక్షలు మాత్రమే) మరియు ధరావత్తు సొమ్ము రూ.1,80,000/- (అక్షరాల లక్ష ఎనభై వేల రూపాయలు మాత్రమే)**గా నిర్ణయించటమైనది. **వేలం తేది & సమయం:** హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌లో ది.10-04-2025, ఉ॥11:00గం॥లకు.

3 **రుణగ్రహీతల వివరాలు: ప్రధాన రుణగ్రహీత: సూరపనేని శివ రాణి,** W/o శివాజీ రావు (లేట్). **డిమాండ్ నోటీసు తేదీ:** 27-05-2024. బకాయి మొత్తం **రూ.5,49,868/-** ది.1.05.2024 నాటికి తదుపరి వడ్డీతో పాటు. హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ నందలి **లోన్ నెం.06-2213-000173**లో పూర్తిగా చెల్లించే వరకు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: సూరపనేని శివ రాణి** డోర్ నెం.6-50, సాయిబాబా ఆలయం దగ్గర, వేలేరు, బాపులపాడు మండలం, కృష్ణ జిల్లా - 521105. 232 చదరపు గజాలు మరియు 232 చదరపు గజాలు బహుమతిగా ఇచ్చిన తర్వాత మిగిలిన మొత్తం స్థలం 743 చదరపు గజాలు అంటే, సర్వే నెం.266/6లో 279 చదరపు గజాలు విస్తీర్ణంలో ఉన్న ఆస్తిలో ఒక గడ్డి ఇల్లు ఉంది. అసెస్‌మెంట్ నెం.538. కనుమోల్ సబ్ రిజిస్ట్రీ కింద డాక్యుమెంట్ నెం.3163/2012 & MD/MODT: 374/2015తో. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- పూర్వం సూరపనేని శివరాణి తరువాత సూరపనేని కిరణ్ శేఖర్ (38 అడుగులు) మరియు పంచాయతీ బజార్, దక్షిణం:- పొట్లూరి నారాయణరావు, పశ్చిమం:- ఎలిమెంటరీ స్కూల్ (79 లింకులు), ఉత్తరం:- కావూరి మోహనరావుకు బహుమతిగా ఇచ్చినది. **రిజర్వు ధర: రూ.4,00,000/- (అక్షరాల నాలుగు లక్షలు మాత్రమే) మరియు ధరావత్తు సొమ్ము రూ.40,000/- (అక్షరాల నలభై వేల రూపాయలు మాత్రమే)**గా నిర్ణయించటమైనది. **వేలం తేది & సమయం:** హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌లో ది.10-04-2025, ఉ॥11:00గం॥లకు.

అమ్మకానికి సంబంధించిన సమాచారము కొరకు బ్యాంక్ **www.gandhicub.com** నందు లేదా బ్యాంక్ అధీకృత అధికారిని సంప్రదించగలరు.
ది.06-03-2025 **సం/- అధీకృత అధికారి**

homefirst We'll take you home
న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్టు చేయడానికి, ఆస్తులు జప్తు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారాలను పరిరక్షిస్తూ 2022లో తాము ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాల్సిన అవసరం వుందా లేదా అనే అంశంపై ఏప్రిల్‌లో నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు గురువారం చెప్పింది. త్రిసభ్య ధర్మాసనం దీనిపై విచారణ జరపాల్సి వుందని, పొరపాటున ద్విసభ్య ధర్మాసనానికి నివేదించారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బెంచ్ అభిప్రాయంతో ఏకీభవించారు. ఏప్రిల్ చివరిలో గానీ, మే మొదటి వారంలో గానీ దీనిపై విచారణకు ఆదేశించాల్సిందిగా కోరారు. పిటిషనర్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ త్రిసభ్య ధర్మాసనంతో అత్యవసరంగా ఈ అంశంపై విచారణ జరపాల్సి వుందన్నారు. త్రిసభ్య ధర్మాసనం ముందే ఈ అంశాన్ని పెట్టాల్సిందిగా తాను అడ్మినిస్ట్రేటివ్ విభాగాన్ని ఆదేశించానని, కానీ ద్విసభ్య ధర్మాసనం ముందుకు ఎలా వచ్చిందో తెలియడం లేదని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. 2022 జులై 27నాటి తీర్పును పున:పరిశీలించాలని కోరుతూ దాఖలైన అనేక పిటిషన్లను సుప్రీం విచారిస్తోంది.

బెయిల్ వంటి కేసుల్లో విచారణ తేదీలను పొడిగించొద్దు : సుప్రీం

న్యూఢిల్లీ : బెయిల్ ఇచ్చే కేసుల్లో సుదీర్ఘమైన విరామం వుండేలా విచారణ తేదీలు నిర్ణయించడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. వైద్య సంబంధమైన కారణాలపై తాత్కాలికంగా బెయిల్ మంజూరు చేయాలన్న పిటిషన్‌పై విచారణను పంజాబ్ హర్యానా హైకోర్టు రెండు నెలల తర్వాత నిర్ణయించిందని పిటిషన్‌దారు తెలియజేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తన క్లయింట్ రెండేళ్ల కుమార్తెకు అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి వున్నందున ఆమెకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్‌దారు హైకోర్టును ఆశ్రయించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. హైకోర్టులో ఫిబ్రవరి 21న విచారణ జరిపి ఈ విషయాన్ని ఏప్రిల్ 22కు పోస్ట్ చేశారు. "స్వేచ్ఛను కల్పించడం వంటి అంశాల్లో కోర్టులు మరీ ఎక్కువ కాలంపాటు సాగదీయరాదని బెంచ్ వ్యాఖ్యానించింది. త్వరితగతిన విచారణ జరిపేందుకు పిటిషనర్ హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతించింది. కనీసం ఇలాంటి విషయాల్లోనైనా ముందుగా విచారించేలా చూడాలని బెంచ్ హైకోర్టును కోరింది. హైకోర్టులో తన క్లయింట్ రెగ్యులర్ బెయిల్ పెండింగ్‌లో వుందని, విచారణ తేదీని ముందుకు జరపాలన్న క్లయింట్ దరఖాస్తును తిరస్కరించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. తాజా వ్యాఖ్యల నేపథ్యంలో కూడా హైకోర్టు దీన్ని తిరస్కరిస్తుందని మీరు భావిస్తున్నారా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.

ఉక్రెయిన్ రక్షణ, యూరప్ భద్రత లక్ష్యం

- బ్రస్సెల్స్‌లో ఇయు నేతల చర్చలు

బ్రస్సెల్స్ : ఉక్రెయిన్‌కు అవసరమైన రక్షణ కల్పిస్తూనే తమ భద్రతను పెంపొందించుకునే లక్ష్యంతో చర్చలు ప్రారంభించినట్లు యురోపియన్ యూనియన్ (ఇయు) నేతలు తెలిపారు. గురువారం బ్రస్సెల్స్‌లో ఇయు నేతలు అత్యవసర చర్చలు ప్రారంభించారు. స్వల్ప కాల వ్యవధిలో యూరప్ రక్షణలను మరింత బలోపేతం చేసేందుకు గల మార్గాలను బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఇయు సదస్సు చైర్మన్ ఆంటానియో కోస్టా, జర్మనీ కొత్త చాన్సలర్‌గా నియమితులవనున్న ఫ్రెడరిక్ మెర్జ్ చర్చించారు. అధికంగా రక్షణ వ్యయాన్ని అనుమతించాలంటే పెద్ద మొత్తంలో రుణాలు చేయాల్సి ఉందంటూ అందుకోసం దేశ నిబంధనలను సరళతరం చేసేందుకు కొన్ని ప్రణాళికలను మెర్జ్ ప్రతిపాదించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఈ రెండు నెలల కాలంలో ప్రధానమైన మార్పు ఒకటి గోచరిస్తోంది. అమెరికా, యూరప్‌ల మధ్య సహకారాన్ని ఆయన ప్రశ్నిస్తున్నారు. అమెరికా విధానంలో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకుని, మరో యుద్ధం పొంచి వుందనే అనుమానాల నేపథ్యంలో ప్రస్తుత రక్షణ చర్యలను యూరప్ నిర్వహించాల్సి వుందని యురోపియన్ పాలసీ సెంటర్ మేథోవర్గం వ్యాఖ్యానించింది. నిర్ణయాత్మకమైన చర్యలతో యూరప్ ముందడుగు వేస్తుందని బుధవారం ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ మీడియాతో వ్యాఖ్యానించారు. సభ్య దేశాలన్నీ తమ మిలటరీ వ్యయాన్ని పెంచుతాయని, సంయుక్త నిధిని ఏర్పాటు చేసి అత్యంత వినూత్నమైన ఆయుధాలు కొనుగోలు చేయడం, మరికొన్ని తయారుచేయడం జరుగుతుందని చెప్పారు. ఉక్రెయిన్ అవసరాలను ఈ సమావేశం పరిష్కరించే అవకాశాలు ఏమాత్రం కనిపించడం లేదు.

కార్పొరేట్, హిందూత్వపై
ప్రతిఘటనకు కోటగా కేరళ

- సమానత్వం, న్యాయం, లౌకికవాదం పరిరక్షణ పోరాటంలో దేశానికే ఆశాకిరణం
- కేరళ 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ప్రకాశ్‌కరత్

గురువారం కేరళ 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న ప్రకాశ్‌కరత్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

కార్పొరేట్, హిందూత్వ బంధానికి వ్యతిరేకంగా దేశంలో జరుగుతున్న ప్రతిఘటనకు కోటగా కేరళ నిలిచిందని సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ అన్నారు. దేశంలో నియో ఫాసిస్ట్ ధోరణులను, నయా ఉదారవాద విధానాలను అడ్డుకునేందుకు పోరాటాలను నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. కేరళలోని కొల్లంలో గురువారం పార్టీ కేరళ 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభమైంది. కొడియేరి బాలకృష్ణన్ నగర్‌లో జరుగుతున్న ఈ మహాసభలో 500 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎకె బాలన్ ఎర్రజెండాను ఎగురవేశారు. మతోన్మాద, పెట్టుబడిదారీ దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో మూడు రోజుల పాటు ఈ మహాసభ జరగనుంది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బృందాకరత్, సుభాషిణి అలీ, బివి రాఘవులు, అశోక్ ధావలే, ఎంఎ బేబీ, ఎ. విజయరాఘవన్, రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో ప్రకాశ్‌కరత్ మాట్లాడుతూ కేరళను కార్పొరేట్, హిందూత్వ బంధానికి వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనకు కోటగా అభివర్ణించారు. సమానత్వం, న్యాయం, లౌకికవాదం కోసం పోరాటంలో కేరళ దేశానికే ఆశాకిరణంగా ఉందన్నారు. నయా ఉదారవాద పెట్టుబడిదారీ దోపిడీ శక్తులను నేరుగా సవాలు చేసే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు సిపిఎం అచంచలమైన నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. కార్మిక వర్గాన్ని విభజించి, నిరంకుశ పాలనతో పెరుగుతున్న హిందూత్వ, మతతత్వాలను నిరోధించడానికి, లౌకిక విలువలను నిలబెట్టడానికి వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం సామాజిక విభజనలను తీవ్రతరం చేస్తోందని, ప్రజలను పోలరైజ్ చేసేందుకు మతపరమైన ద్వేషాన్ని తీవ్రతరం చేస్తోందని విమర్శించారు. దేశం నయా ఫాసిజంలోకి దిగజారకుండా నిరోధించడానికి విస్తృత, ఐక్య కూటమి ఏర్పాటుకు పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పార్టీ స్వతంత్ర వైఖరిని పునరుద్ఘాటించారు.

మోడీ విధానం దేశాన్ని ఒంటరిని చేసింది

దేశం ఇప్పటివరకు అనుసరించిన విదేశాంగ విధానానికి భిన్నంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అమెరికన్ అనుకూల విదేశాంగ విధానం దక్షిణాసియా ప్రాంతంలో మన దేశం ఒంటరితనానికి దారితీసిందని ప్రకాశ్‌కరత్ అన్నారు. పాలస్తీనా సమస్యపై మోడీ ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడమే కాకుండా, వారికి ఆయుధాలు అందించే వైఖరిని కూడా తీసుకున్నారని అన్నారు. మహిళలు, పిల్లలు సహా దాదాపు లక్ష మంది ప్రజలు మరణించిన పాలస్తీనాకు వ్యతిరేకంగా అమెరికాను సంతృప్తి పరచడానికే ఈ వైఖరి తీసుకున్నారని తెలిపారు. ఇజ్రాయిల్ అనుకూల, చైనా వ్యతిరేక 'క్వాడ్' శిఖరాగ్ర సమావేశాన్ని దేశంలో నిర్వహించి, ట్రంప్‌ను ఆహ్వానించడమే మోడీ అమెరికా పర్యటన ముఖ్య ఉద్దేశమని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వాడ్ అనేది అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారతదేశం కూటమి అని, ఈ విధానాలు మోడీ ప్రభుత్వ దేశవ్యతిరేక ముఖాన్ని చూపిస్తున్నాయని విమర్శించారు. సమాఖ్య వాదాన్ని, రాజ్యాంగాన్నే బలహీనపరిచే వైఖరిని అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబానీ, అదానీలాంటి కార్పొరేట్లకు దోచిపెడుతూ, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించే విధానాలు ప్రమాదకరమైన రీతిలో అమలు చేస్తున్నారని విమర్శించారు. వామపక్షాల బలాన్ని పెంచడం ద్వారా ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయాలని కరత్ అన్నారు.

ప్రపంచాన్ని వాణిజ్య యుద్ధంలోకి నెట్టేసిన ట్రంప్ విధానాలు

ట్రంప్ విధానాలు ప్రపంచాన్ని వాణిజ్య యుద్ధంలోకి నెట్టివేస్తాయని ప్రకాశ్‌కరత్ విమర్శించారు. చైనా వృద్ధిని అడ్డుకోవడంలో భాగంగానే అమెరికా, దాని మిత్రదేశాలు 20శాతం వాణిజ్య ఆంక్షలు విధించాయని చెప్పారు. ఆధిపత్యాన్ని తిరిగి పొందే ప్రయత్నంలో ట్రంప్ అత్యంత అమానవీయ వైఖరి గత ఆరు వారాలలో బయటపడిందన్నారు. గ్రీన్‌ల్యాండ్, కెనడా, పనామా కాలువలు అమెరికాలో భాగమని, గాజాను స్వాధీనం చేసుకుని అక్కడ ఒక రిసార్ట్‌ను నిర్మిస్తామని ప్రకటించడంతోపాటు ఇతర దేశాల స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారంపై దాడికి పూనుకున్నాయని అన్నారు. అమెరికా, దాని మిత్రదేశాల తీవ్ర మితవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా వామపక్ష శక్తుల కదలిక కనిపిస్తోందని తెలిపారు. లాటిన్ అమెరికన్ దేశాలలో వామపక్ష పార్టీలు ప్రజా తిరుగుబాట్లతో అధికారంలోకి వచ్చాయని అన్నారు. మార్క్సిస్ట్ భావజాలం ఆధారంగా పనిచేసే జనతా విముక్తి పెరుమన పార్టీ శ్రీలంకలో అధికారంలోకి రావడం పురోగామి సూచికని అన్నారు.

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

రాబోయే ఎన్నికల సవాళ్లకు సిపిఎం వ్యూహాన్ని రచించడం ఈ మహాసభ లక్ష్యాల్లో ఒకటని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, సోషలిజం, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని బలోపేతం చేయడం ద్వారా ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు.

"నవ కేరళకు కొత్త మార్గాలు" డాక్యుమెంట్ ప్రవేశపెట్టిన సిఎం విజయన్

ముఖ్యమంత్రి పినరయి విజయన్ "నవ కేరళకు కొత్త మార్గాలు"పై దృష్టి సారించిన వివరణాత్మక అభివృద్ధి డాక్యుమెంట్‌ను ప్రవేశపెట్టారు. కార్పొరేట్ లాభాల కంటే ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చే స్థిరమైన, సమానమైన వృద్ధికి పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ రాష్ట్రంలోని పార్టీ విజయాలు, సవాళ్లపై ఒక నివేదికను ప్రవేశపెట్టారు. కార్మికవర్గం, అణగారిన వర్గాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో సిపిఎం పాత్రను స్పష్టం చేశారు. ఈ మహాసభ ఈ నెల 9న రెడ్ వాలంటీర్ మార్చ్, ప్రజా ర్యాలీతో ముగుస్తుంది.

బందీలను విడుదల చేయకపోతే మీ అంతు చూస్తాం!

- గాజాపై ట్రంప్ తాజా బెదిరింపులు
- శాశ్వత శాంతితోనే మిగిలిన బందీల విడుదల
- స్పష్టం చేసిన హమాస్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గాజాపై బెదిరింపులకు దిగారు. మిగిలిన బందీలందరినీ తక్షణమే విడుదల చేయాలని, ఇప్పటివరకు హత్యకు గురైన వారి మృతదేహాలను అప్పగించాలని, లేనిపక్షంలో మీ అంతు చూస్తామని ట్రంప్ బుధవారం హమాస్ నేతలను బెదిరించారు. హమాస్ నేతలందరూ గాజా విడిచి పారిపోవాలని హుకుం జారీ చేశారు. గాజాపై విధ్వంసానికి దిగిన ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటిస్తూ, పని పూర్తి చేయడానికి ఇజ్రాయిల్‌కు అవసరమైన ఆయుధాలను పంపుతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్‌లో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన బందీలను కలిసిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. "ఇదే మీకు చివరి హెచ్చరిక. గాజాను వదిలి వెళ్లాల్సిన సమయం వచ్చింది" అని హమాస్ నేతలను బెదిరించారు. 'గాజా ప్రజల కోసం మంచి భవిష్యత్తు ఎదురు చూస్తోందని, కానీ మీరు బందీలను విడుదల చేయకుంటే గాజా అంతటా పరిణామాలు తీవ్రంగా వుంటాయి' అని అన్నారు.

మిగిలిన బందీలను హమాస్ అప్పగించకపోతే ఊహించలేని పరిణామాలు వుంటాయని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

శాశ్వత శాంతి నెలకొంటేనే : హమాస్

ట్రంప్ తాజా బెదిరింపులను హమాస్ గురువారం కొట్టిపారేసింది. గాజాలో శాశ్వత శాంతి నెలకొంటేనే మిగిలిన బందీలను విడుదల చేస్తామని పునరుద్ఘాటించింది. జనవరిలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నుండి బయటకు వెళ్లిపోవాలని ట్రంప్, నెతన్యాహు ప్రయత్నిస్తున్నారని హమాస్ విమర్శించింది. మరింతమంది పాలస్తీనియన్ ఖైదీలను విడుదల చేసి, గాజాలో శాశ్వత కాల్పుల విరమణ, గాజా నుండి ఇజ్రాయిల్ బలగాల ఉపసంహరణ జరిగితే బందీలను విడుదల చేస్తామని, ఇందుకోసం రెండో దశ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరగాలని ఆనాటి ఒప్పందం పిలుపునిస్తోంది. రెండో దశపై చర్చలు జరపడమే మిగిలిన బందీల విడుదలకు ఉత్తమ మార్గమని హమాస్ ప్రతినిధి అబ్దుల్ లతీఫ్ అల్ కనువా తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఈ చర్చలు జరగాల్సి వుందని, ఇప్పటివరకు కేవలం సన్నాహక చర్చలు మాత్రమే జరిగాయని అన్నారు. హమాస్ వద్ద ఇంకా 24మంది బందీలు సజీవంగా వున్నారని, మరణించిన 34మంది బందీల మృతదేహాలు ఉన్నాయని భావిస్తున్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు !

- తేల్చి చెప్పిన చైనా

బీజింగ్ : బెదిరింపులకు భయపడబోమని, అయినా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు, ఇతర సవాళ్లను ఎదుర్కొనగలిగే సామర్థ్యం తమ ఆర్థిక వ్యవస్థకు వుందని చైనా వాణిజ్య శాఖ మంత్రి వాంగ్ వెంటావో స్పష్టం చేశారు. వాణిజ్య యుద్ధంలో విజేతలు అంటూ ఎవరూ వుండరని వ్యాఖ్యానించారు. చైనా నేషనల్ కాంగ్రెస్ వార్షిక సమావేశం సందర్భంగా వాంగ్ మాట్లాడుతూ గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా వుందని పునరుద్ఘాటించారు. బెదిరింపులు, బలవంతపు చర్యలు అంతిమంగా విఫలమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. చైనాపై ఇలాంటివి పనిచేయవని అన్నారు. తమను భయపెట్టలేరన్నారు. దేశ ప్రయోజనాలు కాపాడుకోవాలన్న చైనా కృతనిశ్చయం తిరుగులేనిదన్నారు. 140 దేశాలకు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా చైనా వుందంటే తమకు అనేక అవకాశాలు వున్నాయని అర్థమని అన్నారు. తమ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక మార్కెట్ల నిర్మాణానికి, బలోపేతానికి అనుసరించే వ్యూహాల గురించి ఆయన వివరించారు. జనవరి నుండి రెండుసార్లు చైనాపై ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లు పెంచింది. చైనా కూడా ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై, కంపెనీలపై ఇలాంటి ఆంక్షలు విధించింది. ఇతర దేశాలతో వ్యవహారాల్లో పరస్పర గౌరవం వుండాలని చైనా ఆకాంక్షిస్తుందన్నారు., అమెరికా ఈ తప్పుడు దారిలోనే ముందుకు సాగితే తాము కూడా అదే రీతిన ప్రతిస్పందిస్తామని, చివరికంటా పోరాడతామని చెప్పారు. వాణిజ్యంపై విభేదాలుంటే పరిష్కరించుకోవడానికి చైనా సిద్ధంగా వుందన్నారు. సాధ్యమైనంత త్వరలో సముచితమైన సమయంలో ఉభయ పక్షాలు సమావేశమై సమాచార మార్పిడి చేసుకోవాలన్నారు.

మిట్టల్‌లో స్థానికులకు 20 వేలఉద్యోగాలు

- కొణతాల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనకాపల్లి నియోజకవర్గం నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్న మిట్టల్ ఉక్కు కర్మాగారంలో స్థానికులు 20 వేల ఉద్యోగాలు ఇవ్వాలని ఆ ప్రాంత శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ప్రశ్నోత్తరాల సందర్భంగా శాసనసభలో ఈ విషయమై ఆయన మాట్లాడుతూ మిట్టల్ కర్మాగారంలో స్థానికులకు, భూములిచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామికీకరణకు భూములిచ్చి సహకరిస్తున్న రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులివ్వాలని, ఆయా కుటుంబ సభ్యులకు అవసరమైతే సాంకేతిక శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో మెసర్స్ ఆర్సిలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్ (ఎఎంఎన్ఎస్) రెండు దశల్లో 17.8 ఎంటిపిఎ ఉక్కు కార్మాగారం రెండు దశల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. మొదటి దశలో 7.3 ఎంటిపిఎ, 2వ దశలో 10.5 ఎంటిపిఎ కర్మాగారం ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ఆ సంస్థకు ప్రభుత్వం ఇస్తున్న ప్యాకేజిని మంత్రి వివరించారు.విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించడం తో పాటు మిట్టల్ కంపెనీని ప్రోత్సహిస్తామని మంత్రి టిజి భరత్ తెలిపారు.

పోసానికి దక్కని ఊరట

ప్రజాశక్తి, అమరావతి

సోషల్ మీడియా ద్వారా అనుచిత పోస్టులు పెట్టారనే కేసులో పోసాని మురళీ కృష్ణపై పిటి వారెంట్లు అమలు కానందున బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసుల్ని హైకోర్టు ఆదేశించింది. ఆదోని పట్టణ పోలీసులు పిటి వారెంట్ నమోదు చేసిన ఆ కేసును కొట్టేసేందుకు హైకోర్టు నిరాకరించింది. మిగిలిన చోట్ల పిటి వారెంట్లు అమలు కానందున పోసానికి సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం ఆదేశాలను జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కొన్ని మీడియా సంస్థల అధినేతలపై పోసాని చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయంటూ శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, విజయవాడ, సూర్యారావుపేట, కర్నూలు జిల్లా, ఆదోని 2వ పట్టణ, విశాఖపట్నం, పద్మనాభం పోలీసులు, తిరుపతి జిల్లా, సూళ్లురుపేట పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. వీటిని కొట్టేయాలంటూ పోసాని పిటీషన్ వేశారు. పోసాని తరుపున సినియర్ లాయర్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదిస్తూ, రాజకీయ దురుద్దేశాలతో తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. పిటిషనర్ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఓబులాపురం పోలీసులు అరెస్ట్ చేశాక బయటకు రాకుండా ఉండేందుకు ఒకదాని తర్వాత మరో కేసు నమోదు చేశారన్నారు. పీటీ వారెంట్ల పేరుతో పలు పోలీస్ స్టేషన్లు తిప్పుతున్నారన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ ఇవన సాంబశివ ప్రతాప్, పీపీ మెండ లక్ష్మీనారాయణ పోలీసుల తరపున వాదిస్తూ, పోసాని పోస్టుల తిట్లపురాణంలో దూషణలు ఉన్నాయన్నారు. ఆదోని పోలీసులు నమోదు చేసిన కేసులో ఇప్పటికే పీటీ వారెంట్‌ను అమలు చేసినట్లు చెప్పారు. దీంతో ఆదోని పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేసేందుకు హైకోర్టు నిరాకరించింది. మిగిలిన చోట్ల పీటీ వారెంట్లు అమలు కానందున పోసానికి సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది.

మహిళా దినోత్సవం రోజున అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

తరువాత మూడు ఉచిత సిలిండర్ల పథకాన్ని పాక్షికంగా అమలుజేశారని పేర్కొన్నారు. మహిళలు డబ్బు చెల్లించకుండా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు మిగిలిన వాగ్దానాలు ఇంత వరకు అమలు చేయలేదని, వాటి అమలుకోసం ఆవేదనతో ఎదురుచూస్తున్నారని వివరించారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీటిని అమలు చేస్తూ ప్రకటన చేయాలని కోరారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదించిందని, కాని దాని అమలుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొన్నారు. 2029 ఎన్నికల నుండే దాన్ని అమలు చేయాలని ఎన్‌డిఏ కూటమిలో ముఖ్య భాగస్వాములుగా ఉన్న పవన్ కల్యాణ్ తన పలుకుబడిని ఉపయోగించాలని కోరారు. 2023 జూలైలో రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారన్న సంచలనమైన వార్తను ఆయన బయట పెట్టిన విషయాన్ని లేఖలో శ్రీనివాసరావు ప్రస్తావించారు. కేంద్ర హోంశాఖ నిఘా వర్గాల నుండి విశ్వసనీయమైన సమాచారం అందినట్లుగా అప్పట్లో పవన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాటి ప్రభుత్వం దీనిపై విచారణ జరపడానికి తిరస్కరించిందని పేర్కొన్నారు. 'ఎన్నికలకు ముందు పదే పదే దీన్ని ఒక వివాదంగా మార్చిన మీరు ఎన్నికల అనంతరం మౌనం దాల్చడం దురదృష్టకరం' అని లేఖలో తెలిపారు. పార్లమెంటులో కేంద్ర హోంశాఖా మంత్రి కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళలు, పిల్లలు అదృశ్యమైనట్లు ప్రకటించారని పేర్కొన్నారు. దీనిపై కూడా కనీసం విచారణ లేదు, వాస్తవాలూ వెల్లడించలేదని తెలిపారు. ఈ మధ్యకాలంలో పసిపిల్లలను అమ్మే ముఠా ఒకటి విజయవాడలో పట్టుబడిందని, ఇలాంటి ముఠాలకు కార్యస్థానంగా మన రాష్ట్రం మారడం ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. 'ఉపముఖ్యమంత్రిగా మీకున్న విచక్షణాధికారాన్ని ఉపయోగించి మహిళల అదృశ్యంపై కమిటీ నియమించాలి. దానికి బాధ్యులైన ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని కోరారు. రాష్ట్రంలో మహిళల రక్షణకు సత్వర న్యాయం కల్పించడానికి సురక్ష పోలీస్ స్టేషన్లు, కొత్త యాప్‌లు తెచ్చినట్లు ప్రకటించినా ఇవి గతంలో ఉన్న పేర్లు మార్పిడి తప్ప ఏ విధంగానూ మహిళలను ఉద్ధరించగలిగేవి కాదని వెల్లడించారు. రాష్ట్రంలో మాఫియా గ్యాంగ్‌లు, డ్రగ్గిస్టులు స్వేచ్ఛగా విహరిస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని, ఇది మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నదని తెలిపారు. మద్యం వాడకం విచ్చలవిడిగా పెరిగి తాగిన మైకంలో చిన్న పిల్లలు, వృద్ధులు అన్న విచక్షణ కూడా కోల్పోయి అత్యాచారాలు చేస్తున్నారని ,ఇళ్లల్లో మహిళలను హింసించి వేధిస్తున్నారని, చిన్న పిల్లల పట్ల రాక్షసంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పతిరోజూ ఎక్కడో ఒకచోట ఇలాంటి దారుణమైన అత్యాచార వార్తలు వింటూ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్, లిక్కర్ మాఫియాలు అధికార పార్టీల అండదండలతోనే స్వైర విహారం చేస్తున్నట్లు ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అనేకచోట్ల కులాంతర వివాహాలు చేసుకున్నవారిపై దాడులు చేస్తున్నారని, హత్యలకూ పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మహిళలను వేధిస్తున్న పై సమస్యలపై 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహించి చర్చించి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని , మహిళల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఈ లేఖలో శ్రీనివాసరావు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరారు.

బడ్జెట్ పద్దులపై సమస్యల ఏకరువు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్ చర్చలో భాగంగా గురువారం అసెంబ్లీలో వ్యవసాయశాఖ, పశు సంవర్ధకశాఖ, సహకారశాఖ, దేవాదాయ, పంచాయతీరాజ్‌శాఖల పద్దు అమోదం కోసం మంత్రులు అచ్చెన్నాయుడు, ఉపముఖ్యమంత్రి తరుపున నాదెండ్ల మనోహర్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. ఈ సమయంలో ఆనం మాట్లాడుతూ తనపేరు, శాఖపేరు పెద్దగా ఉన్నాయని లెక్కలు తగ్గిపోతున్నాయని చలోక్తి విసిరారు.

ప్రతిపాదనలపై నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి పంచాయతీరాజ్‌శాఖపై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ శాఖను నిర్వీర్యం చేశారని, దాన్ని పవన్ కల్యాణ్ నేతృత్వంలో ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. భీమవరం ఎమ్మెల్యే పులివర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ కింద సిమెంటు రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఆధ్వర్యాన గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను వేయాలని కోరారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ పంచాయతీల్లో రోడ్లు, డ్రెయిన్లు ఒకసారి పూర్తి చేయాలని కోరారు.

వ్యవసాయశాఖపై పొన్నూరు ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ రైతులకు లక్ష రూపాయల వరకూ రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గతేడాది కృష్ణాజిల్లాలో ఆరు లక్షల టన్నుల కొనుగోలు జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు ధాన్యాన్ని రోడ్డుపై పడబోసి నిరసన వ్యక్తం చేసిన పరిస్థితి ఉందని అన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ యంత్రాలు ఇవ్వడంతోపాటు, సేంద్రీయ వ్యవసాయాన్ని పెంచాలని కోరారు. బూర్ల రామాంజనేయులు, వంశీకృష్ణ శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. అలాగే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వంశధార ప్రాజెక్టును ఈ ఏడాది పూర్తి చేయాలని కోరారు.

అనంతరం మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, ఆనం రామనారాయణరెడ్డి వివరణ ఇచ్చారు.

ఆర్థిక నేరగాళ్ల ఆస్తులు జప్తు చేయాలి
గల్లా మాధవి, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే

ఆర్థిక నేరాలను పరిష్కరించాలని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేయాలని కోరారు. నిందితుల ఆస్తులను జప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ స్థానికుల సాగులో ఉన్న భూములకు పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని, దీనివల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రహదారులపై బ్లాక్‌స్పాట్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై బిసి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామని అన్నారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో అవకతవకలు: బొండా ఉమ

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ అతిపెద్ద విగ్రహం తన నియోజకవర్గ పరిధిలో ఉందని, దాని నిర్మాణంలో అనేక అవతకవలు ఉన్నాయని, సగం పనులు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. సచివాలయాల వ్యవస్థలో మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్ కోరారు. కార్యదర్శుల పనితీరుపై సర్వే చేస్తే ఐదుశాతం మాత్రమే సేవలు అందిస్తున్నట్లు తెలిపారని చెప్పారు.

కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ప్రమాద ప్రదేశానికి రోబోలను పంపే యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి సొరంగంలో కార్మికుల ఆచూకీ కోసం కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్‌ను రప్పించారు. శుక్రవారం ఇవి టన్నెల్ లోపలికి వెళ్లనున్నాయి. మట్టిలోపల కూరుకుపోయిన జీవాలను క్యాడ్‌వర్ డాగ్స్ పసిగట్టనున్నాయి. పనులను స్వయంగా పర్యవేక్షించేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, కేరళ నుంచి వచ్చిన క్యాడవర్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి గురువారం సాయంత్రం టన్నెల్‌లోకి వెళ్లారు. కార్మికుల జాడ తెలుసుకునేందుకు గత 13 రోజులుగా రెస్క్యూ టీంలు పని చేస్తున్నాయి. ఊట నీరు, మట్టి పేరుకుపోయి ప్రమాద స్థలం కాంక్రీట్‌గా మారింది. దీంతో మట్టిని వెలికి తీయడం కష్టంగా మారింది. టిబిఎం మిషన్ దగ్గర సొరంగం కూలుతుందనే భయంతో రోబో టెక్నాలజీతో కార్మికులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఎన్‌వీ రోబో టెక్నాలజీ బృందాలను సొరంగంలోకి పంపి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. సహాయక చర్యలను గురువారం సాయంత్రం మినిస్ట్రీ ఫర్ హోం అఫైర్స్ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రటరీ కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ పర్యవేక్షించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆయనకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్ టన్నెల్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, కొనసాగుతున్న సహాయక చర్యలను వివరించారు.

ఆర్‌జివిపై కఠిన చర్యలు వద్దు : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై ఆరు వారాల పాటు ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోరాదని సిఐడిని హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని సిఐడి అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 17కి వాయిదా వేస్తూ జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం మధ్యంతర ఆదేశాలను వెలువరించారు. కమ్మరాజ్యంలో కడప రెడ్లు.. సిన్మా తీసిన వర్మ సమాజంలో కులవైషమ్యాలను రెచ్చగొట్టారంటూ గుంటూరు, మంగళగిరికి చెందిన బండారు వంశీకృష్ణ చేసిన ఫిర్యాదు మేరకు సిఐడి నమోదు చేసిన కేసును కొట్టేయాలని రామ్‌గోపాల్ వర్మ పిటిషన్ దాఖలు చేశారు. వర్మ తరుపున లాయర్ వాదిస్తూ, కక్షపూరిత, రాజకీయ దురుద్దేశాలతో నమోదు చేసిన కేసును కొట్టేయాలన్నారు. సెంట్రల్ సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిన ఈ సినిమా 2019లో రిలీజు అయ్యిందని, 2024లో కేసు నమోదు చెల్లదన్నారు.

విజయవాడలో జరిగిన ఆశాల ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవి

ఆశాల పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం చూపవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఎపి ఆశావర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు జరిగి ఏడాది అవుతున్నా, ఇందుకు సంబంధించి ఉత్తర్వులు విడుదల కాలేదన్నారు. గత ఏడాదిలో మృతి చెందిన ఆశా వర్కర్లకు పిఎంజెజెబివై వర్తింపజేస్తామని చెప్పినా, ప్రీమియం చెల్లించకపోవడంతో ఆ బీమా సౌకర్యానికి నోచుకోలేదన్నారు. ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించాలని ఏళ్లతరబడి మొర పెట్టుకుంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వలే ఆశా వర్కర్లను 60 ఏళ్లకు పదవీ విరమణ చేయిస్తున్నారే తప్ప రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వానికి రెండు నెలలు గడువు ఇస్తున్నామని ఈ లోగా ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎపి ఆశావర్కర్ల సంఘం కోశాధికారి ఎ.కమల, రాష్ట్ర నాయకులు పద్మ, రాఘవమ్మ, ధనశ్రీ, లక్ష్మీసౌభాగ, సుభాషిణి, అమర, సుధారాణి, పార్వతి, రమణకుమారి, గంగా, జ్యోతి వెంకటలక్ష్మీ, వెంకటేశ్వరమ్మ, వాణిశ్రీ తదితరులు ప్రసంగించారు.

పలు జిల్లాల్లో నిర్బంధాలు

తమ డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడకు బయలుదేరిన ఆశా వర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పలు జిల్లాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే పోలీసులు ఆశాల ఇళ్లకు వెళ్లి గృహ నిర్బంధం చేశారు. పోలీసు స్టేషన్లకు తరలించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో అడ్డుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లా కాకినాడ, సామర్లకోట రైల్వే స్టేషన్ల వద్ద ఆశాలను పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రెండు గంటల తరువాత వారిని విడిచిపెట్టారు. ఈ నిర్బంధాలను వ్యతిరేకిస్తూ ఆశాలు కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబిరాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ ఆశాలపై నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని ఆశా వర్కర్ల ఇళ్లకు పోలీసులు వెళ్లి వారి సెల్ ఫోన్లు లాక్కొని, గృహ నిర్బంధం చేశారు. ఆశాల అక్రమ అరెస్టులను ఖండిస్తూ పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలోని ఏటిగట్టు సెంటర్ వద్ద ఆశాలు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు.

మీకోసం

నిమ్మకాయలు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే పేపరులో చుట్టి జిప్ లాక్ కవరులో భద్రపర్చుకోవాలి.

జీవన సౌరభం

నిలబడి ఆలోచిస్తే అద్భుతాలు జరగవు. నిరంతరం శ్రమిస్తేనే విజయం వరిస్తుంది.

అంకెలతో ఆటలు



ఒకటి ఒకటి ఒకటి
మానవులంతా ఒకటి
రెండు రెండు రెండు
నింగి నేల రెండు!

మూడు మూడు మూడు
ఏడాదికి కాలాలు మూడు
నాలుగు నాలుగు నాలుగు
లోకానికి దిక్కులు నాలుగు!

ఐదు ఐదు ఐదు
పంచభూతాలు ఐదు

ఆరు ఆరు ఆరు
జగతికి ఋతువులు ఆరు!

ఏడు ఏడు ఏడు
మహా సముద్రాలు ఏడు
ఎనిమిది ఎనిమిది
ఎనిమిది
ప్రపంచ వింతలు
ఎనిమిది!

తొమ్మిది తొమ్మిది తొమ్మిది
మనిషికి రంధ్రాలు తొమ్మిది

పది పది పది
దశ దిశలు పది!

– బి. పాండురంగ,
83412 12132.



చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

తోట జయశ్రీ,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
ముత్యాల పేట, కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా,
88978 82202.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వేసవికాలం..సమతుల ఆహారమే మేలు

అసలే వేసవి కాలం...రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయ్. రాబోయే రోజుల్లో తీవ్రమైన ఎండలు, వడగాల్పులు సైతం పెరుగుతాయి. అందువల్ల ఈ కాలంలో మనం తీసుకునే ఆహారం అత్యంత కీలకం. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. చెమట అధికంగా ఉత్పన్నమవుతుంది. శరీరంలోని లవణాలు తగ్గిపోతాయి. ఫలితంగా వడదెబ్బ భారినపడే అవకాశం ఉంది. వేసవి తాపాన్ని తట్టుకోలేక చాలామంది చల్లని పదార్థాలు తీసుకుంటూ ఉంటారు. ఇది ఇంకో చేటు కల్గిస్తుంది. వేసవిలో చర్మ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఇవన్నీ ఎదుర్కొనాలంటే మన రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. అందుకు ప్రతిఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలి.

వేసవికాలం అంటేనే చాలామందికి భయం వేస్తుంది. వేడిగాలులు, ఉక్కపోత, అధిక చెమటతో ఉక్కిరి బిక్కిరి అవుతుంటాం. కాలాన్ని మార్చటం మన చేతుల్లో లేదు. మన జీవన శైలిలో భాగంగా మన నడక, నడత, ఆహారం, వ్యాయామం, నిద్ర అన్నింటినీ కాలానుగుణంగా మార్చుకోవాలి. రక్షిత మంచినీరు, మంచి పౌష్టికాహారం తీసుకోవటం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మనం తినే ఆహారమే మన ఆరోగ్యాన్ని కాపాడుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు. మన శరీరం కాలానుగుణంగా వాతావరణానికి అలవాటు పడేలా ఉండాలి. ఈ క్రింది వాటిని పాటిస్తే ఆరోగ్య సంరక్షణ పదిలం.

రక్షిత మంచినీరు : మన శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. ఇది అధిక ఉష్ణోగ్రతను తగ్గించటంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ నిల్వలను కాపాడుకుంటే మన ఆరోగ్యానికి తిరుగుండదు. ఈకాలంలో తరచూ నీటిని ఎక్కువగా తాగుతుండాలి. అప్పుడు శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకూడదు. నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బకు గురౌతారు. ఒక్కోసారి కోమాలోకి సైతం వెళ్లే ప్రమాదం ఉంటుంది. మరీ నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.

తాజాపండ్లు : నీరు, పోషకాలశాతం ఎక్కువ ఉన్న ఆహారం తీసుకోవాలి. తాజాపండ్లు, కూరగాయలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. పుచ్చకాయ, కర్బూజ, బొప్పాయి, జామ, అరటిపండు, వాటర్ యాపిల్, ద్రాక్ష మొదలైనవి ఎక్కువగా తీసుకోవాలి. నిమ్మ, నారింజ, బత్తాయి, కమలా పండ్ల రసాలు శ్రేయస్కరం. ప్రకృతిపరంగా లభించే పండ్లు, పండ్ల రసాలు అన్ని విధాలుగా మంచిది. రాగులు, జొన్నలు మొదలైన చిరు ధాన్యాలు తీసుకోవటం కూడా మంచిదే. ఇవి శక్తిని ఇస్తాయి. ఎండల్లో నిస్సత్తువ ఉండదు.

ద్రవపదార్థాలు : వేసవిలో పెరుగు తీసుకోవటం వల్ల శరీరం చల్లబడుతుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు కూడా మెరుగుపడుతుంది. పుదీనాతో కలిపి తీసుకుంటే ఎక్కువ లాభాలుంటాయి. ఉల్లిపాయలు కూడా శరీరాన్ని చల్లబరుస్తాయి. ఉల్లిని నిత్యం ఆహారంలో భాగంగా తీసుకుంటే వడదెబ్బ తగలదు. మజ్జిగ శరీరంలోని జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో ప్రోబయోటిక్స్ అధికంగా ఉంటాయి. కొబ్బరినీళ్లు ఈకాలంలో తరచూ తీసుకోవాలి. వీటిలో ఉండే ఖనిజ లవణాలు ఎక్కువ శక్తిని ఇస్తాయి. వడగాల్పులు, వేడిగాలుల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి.

పటిష్టమైన రోగ నిరోధక వ్యవస్థ : వేసవిలో బలమైన రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. ఖనిజలవణాలు అధికంగా ఉండేలా చూసుకోవాలి. ఆహారంలో పాలు, గుడ్లు, టమోటా, నారింజ, పసుపు రంగు కూరగాయలు, చిలకడదుంప, చేపలు మొదలైనవి తీసుకోవాలి. ఇవేకాకుండా బ్లాక్ బెర్రీ, బ్లూ బెర్రీస్‌లు తినటం చాలామంచిది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇంకాను ఆహారంలో సొరకాయ, దోసకాయ, బీరకాయ, పొట్లకాయ మొదలైన కూరగాయలు వినియోగించటం ఎంతో మంచిది. ఈ విధమైన ఆహారాన్ని ఎక్కువగా సలాడ్ రూపంలో తీసుకోవటం మంచిది.

పోషకాల ఆహారం శ్రేయస్కరం

విటమిన్ ఎ : ఇది కంటి చూపును, రోగ నిరోధక వ్యవస్థను పటిష్టపరుస్తుంది. కాప్సికం, పాలు, గుడ్లు, టమాటా, ముదురు ఆకుపచ్చ కూరగాయలు, నారింజ, పసుపు కూరగాయలు, క్యారెట్, చిలగడదుంప వంటివి సమృద్ధిగా తీసుకోవాలి.

విటమిన్ సి : ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది. ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఫ్రీ రాడికల్స్‌ను న్యూట్రల్ చేయడానికి సహాయపడుతుంది. ఇది చర్మాన్ని రక్షిస్తుంది. ఉసిరి, మామిడి, నారింజ, కివి, నిమ్మకాలు, గ్రేప్‌ఫ్రూట్, టమోటాలు, ద్రాక్ష, బంగాళదుంపలు, స్ట్రాబెర్రీలు, బ్రోకలీ, బొప్పాయిలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది.

విటమిన్ ఇ : పొద్దుతిరుగుడు విత్తనాలు, బాదం, వేరుశెనగ, పీనట్ బటర్, గుమ్మడికాయ గింజలు, క్యాప్సికం, బీట్‌రూట్, ఆకుకూరల్లో ఇది ఎక్కువగా లభిస్తుంది. ఇది శరీరంలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. టాక్సిన్స్, వ్యర్థాలను క్లియర్ చేస్తుంది. ఫ్రీ రాడికల్స్‌తో సమర్థవంతంగా పోరాడుతుంది. శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

విటమిన్ డి : వేసవిలో కండరాల నొప్పులు, జీర్ణ సమస్యలను నివారించటానికి శరీరంలో తగినంత విటమిన్ డి అవసరం. ఉదయం పూట కొద్దిసేపు సూర్యరశ్మిలో ఉండటంతోపాటు పెరుగు, పాలు, ఓట్స్, పుట్టగొడుగులు, గుడ్డు పచ్చసొన వంటివి తీసుకోవాలి.

ఎలక్ట్రోలైట్లు : వేసవిలో చెమట ద్వారా అధిక మొత్తంలో పొటాషియం బయటకు వెళ్తుంది. ఎలక్ట్రోలైట్లు ఫ్లూయిడ్ సమతుల్యతను నియంత్రించటంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరును మెరుగుపరుస్తుంది. అరటిపండ్లు, బీన్స్, పప్పులు, మామిడి, ద్రాక్ష, నేరేడు పండు, ఆకుకూరలు తీసుకోవాలి.

మెగ్నీషియం : చెమటలతో శరీర ఎలక్ట్రోలైట్ అసమతుల్యతకు దారితీస్తుంది. డార్క్ చాక్లెట్, నట్స్, సోయా, విత్తనాలు, తృణధాన్యాలు, అరటిపండు, ముదురు ఆకుకూరలు తినాలి.

ఇవి చేయాలి

ఆహారానికి తోడు ఈ క్రింది జాగ్రత్తలు కూడా పాటించాలి

- ఎండల్లో అవసరమైతే తప్ప తిరగకుండా ఉండటం మేలు
- తలపై రక్షణకు గొడుగు లేదా టోపీ పెట్టుకోవాలి
- చేనేత కాటన్ దుస్తులు ధరించటం మేలు
- రక్షిత మంచినీటినే తాగాలి
- సరిపడా నిద్ర పోవాలి
- ప్రతిరోజూ వ్యాయామం చేయాలి
- ఇవి చేయొద్దు
- శీతల పానీయాలను తీసుకోవద్దు
- స్ట్రీట్‌ఫుడ్ తినొద్దు
- నూనె వేపుళ్లలా ఉండే ఆహారం తగ్గించటం మేలు
- కాఫీలు, టీలు తగ్గించేయాలి
- సాల్టెడ్‌ఫుడ్స్, నిల్వ ఆహారం తినొద్దు
- మసాలాలు ఎక్కువ ఉండే ఆహారం వద్దు
- మాంసాహారం తగ్గించటం ఉత్తమం
- డాక్టర్ శాంతిశ్రీ కె.వి

అసోసియేట్ ప్రొఫెసర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్,
న్యూట్రీషన్ అండ్ డైటెటిక్స్,
ఆచార్య నాగార్జున
విశ్వవిద్యాలయం.

మాక్రాన్ అణు వ్యాఖ్యలు ముప్పే!

- రష్యా విమర్శ

మాస్కో : ఫ్రాన్స్ అణు నిరోధకతను యురోపియన్ భాగస్వామ్య దేశాలకు విస్తరించడాన్ని ఒక 'ముప్పు'గా రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ వ్యాఖ్యానించారు. "ఇది రష్యాకు వ్యతిరేకంగా తీసుకున్న చర్య, మాక్రాన్ మమ్మల్ని ఒక ముప్పుగా భావిస్తున్నట్లైతే, అణ్వాయుధం ఉపయోగించక తప్పదనుకుంటే రష్యాపై వారు అణ్వాయుధం ఉపయోగిస్తారు. ఇది ముప్పే కదా?' అని లావ్‌రోవ్ పత్రికా సమావేశంలో అన్నారు. బుధవారం మాక్రాన్ మాట్లాడుతూ, రష్యాను ఫ్రాన్స్, యూరప్‌లకు ఒక ముప్పుగా అభివర్ణించారు. ట్రంప్ ఆధ్వర్యంలో అమెరికా, ఉక్రెయిన్ విషయంలో తన వైఖరి మార్చుకోవడం తమకు తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందని అన్నారు. మాక్రాన్ వాస్తవికతకు దూరంగా జరిగి మాట్లాడుతున్నారని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జకరోవా గురువారం వ్యాఖ్యానించారు. పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్‌లో శాంతి పరిరక్షక బలగాలుగా యూరప్ దళాలను మోహరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని లావ్‌రోవ్ పునరుద్ఘాటించారు. ఈ విషయంలో సర్దుబాటు ధోరణి లేదన్నారు.

దురహంకారం వీడండి : స్టాలిన్

చెన్నై : భాషా సమానత్వాన్ని కోరుకోవడం దురహంకారం కాదని, కేంద్రం దురహంకార చర్యలను మానుకోవాలని తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మాతృభాష అనే అంశం 'కందిరీగల తుట్టు' వంటిదని, దానిని తాకడం ప్రమాదకరమని గురువారం సోషల్ మీడియా పోస్టులో ఆయన తెలిపారు. 'ప్రత్యేక హక్కులకు అలవాటు పడిన తర్వాత, సమానత్వం అణచివేతలా అనిపిస్తుంది' అని ఈ సందర్భంగా ఒక ప్రఖ్యాత కోట్‌ను గుర్తు చేశారు. తమిళనాడులో తమిళులకు సరైన స్థానం కోరడాన్ని నేరంగా పేర్కొంటూ కొంతమంది మతోన్మాదులు తమని దురహంకారులు, దేశ వ్యతిరేకులుగా ముద్ర వేస్తుండటతో ఈ ప్రసిద్ధ కోట్ గుర్తుకు వచ్చిందని తెలిపారు. చైనా దురాక్రమణ, బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం, కార్గిల్ యుద్ధాల సమయంలో అత్యధిక మొత్తంలో నిధులు అందించిన డిఎంకె, ఆ ప్రభుత్వ దేశభక్తిని ప్రశ్నించే టెంపరితనాన్ని గాడ్సే భావజాలాన్ని కీర్తించే వ్యక్తులే ప్రదర్శిస్తున్నారని, 'గాంధీ'ని హత్య చేసిన వ్యక్తి వారి సైద్ధాంతిక పితామహుడని పేర్కొన్నారు. 140 కోట్ల మంది ప్రజల కోసం ఉద్దేశించిన మూడు క్రిమినల్ చట్టాలను తమిళులు ఉచ్చరించలేని, చదవలేని ఒక భాషలో రూపొందించడం దురహంకారమని అన్నారు. దేశ ప్రగతికి అత్యధికంగా దోహదపడే రాష్ట్రంలో పౌరులను రెండవ తరగతివారిగా పరిగణించడం, ఎన్ఇపి అనే విషాన్ని మింగడానికి నిరాకరించినందుకు ఆ రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాను నిరాకరించడం దురహంకారమని స్టాలిన్ తెలిపారు. 'దేనైనా బలవంతంగా రాష్ట్రాలపై రుద్దడంతో శతృత్వం పెరుగుతుంది. శతృత్వం ఐక్యతను దెబ్బతీస్తుంది. కావున తమకే హక్కుందని భావించే హిందీ మతోన్మాదులే నిజమైన దురహంకారులు, దేశవ్యతిరేకులు. మన ప్రతిఘటనను దేశద్రోహమని ప్రచారం చేస్తారు' అని అన్నారు.

త్రిభాషా విధానం దేశానికి మంచిది : కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

నూతన విద్యా విధానం (ఎన్ఇపి)లో త్రి భాషా విధానం యావత్తు దేశానికి మంచిదని కేంద్ర మంత్రి రిజిజు తెలిపారు. దక్షిణ ప్రాంతంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కోసం ప్రధానమంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్ (పిఎంజెవికె) ప్రాంతీయ సమీక్ష, శిక్షణ వర్క్‌షాప్‌లో పాల్గొనడం కోసం తిరువనంతపురం వచ్చిన కేంద్ర మంత్రి ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. త్రిభాషా విధానంపై దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యతిరేకతపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'కొంత మంది తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని, రాజకీయాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని' చెప్పారు.

ప్లే-ఆఫ్స్‌కు చేరువలో ముంబయి

- యుపిపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం

లక్నో: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో ముంబయి ఇండియన్స్ ప్లే-ఆఫ్స్‌కు చేరువైంది. యుపి వారియర్స్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆ జట్టు 8పాయింట్లతో రెండోస్థానానికి ఎగబాకింది. తొలుత బౌలర్ అమేలియా కెర్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో చెలరేగడంతో యుపి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 150పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ముంబయి జట్టు 18.3ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 153పరుగులు చేసి విజయం సాధించింది.

టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ముంబయి ఇండియన్స్ జట్టు యుపి వారియర్స్‌ను నామమాత్రపు స్కోర్‌కే పరిమితం చేసింది. అమేలియా కెర్ ఐదు వికెట్లతో విజృంభించడంతో వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులే చేసింది. ఓపెనర్ జార్జియా వాల్(55) అర్ధ సెంచరీతో రాణించగా.. గ్రేస్ హ్యారిస్(28) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 74 పరుగులు జోడించారు. హ్యారిస్, వాల్ క్రీజ్‌లో ఉండగా.. వారియర్ భారీ స్కోర్ దిశగా పయనించింది. అయితే 16 పరుగుల వ్యవధిలో వీరిద్దరూ ఔట్ కావడంతో వారియర్స్ కష్టాల్లో పడింది. హ్యారిస్, వాల్ ఔటయ్యాక వారియర్జ్ క్రమంగా వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ దీప్తి శర్మ చివరి ఓవర్ వరకు క్రీజ్‌లో ఉన్నప్పటికీ భారీస్కోర్ చేయలేకపోయింది. ఆఖర్లో ఎక్లెస్టోన్ ఓ మోస్తరుగా బ్యాట్‌ను ఝులిపించడంతో వారియర్స్ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. పాయింట్ల పట్టికలో వారియర్స్ ఆఖరి స్థానంలో ఉంది. కెప్టెన్ దీప్తి శర్మ(27), వందా దినేశ్(10), ఆఖర్లో సోఫీ ఎక్లెస్టోన్(16) రెండంకెల స్కోర్లు చేశారు. కిరణ్ నవ్‌గైరే, శ్వేతా సెహ్రావత్ డకౌట్లు కాగా.. చిన్నెల్ హెన్రీ 6, ఉమ్రా ఛెత్రీ ఒక పరుగు చేశారు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో అమేలియా కెర్‌తో పాటు హేలీ మాథ్యూస్ రెండు, సీవర్ బ్రంట్, సిసోడియా ఒక్కో వికెట్‌తో రాణించారు.

మహిళల ప్రిమియర్ లీగ్ పాయింట్ల పట్టిక

జట్లు	ఆ	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ క్యాపిటల్స్	**7**	**5**	**2**	**10**	**+0.48**
ముంబయి	6	4	2	8	+0.26
గుజరాత్ జెయింట్స్	6	3	3	6	+0.35
బెంగళూరు	6	2	4	4	-0.24
యుపి వారియర్స్	7	2	5	4	-0.78

భారత్, శ్రీలంక, దక్షిణాఫ్రికా మహిళల మధ్య ముక్కోణపు సిరీస్

కొలంబో: శ్రీలంక వేదికగా ఏప్రిల్‌లో మహిళల ముక్కోణపు వన్డే టోర్నీ జరుగనుంది. శ్రీలంక ఆతిథ్యమిచ్చే ఈ సిరీస్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు కూడా పాల్గొంటున్నాయి. ఈ టోర్నీ డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ప్రతి జట్టు నాలుగు గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లు ఆడనుంది. గ్రూప్ మ్యాచ్‌ల అనంతరం టాప్-2లో నిలిచిన రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లన్నీ కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరగనున్నాయి. ఏప్రిల్ 27న భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో టోర్నీ ఆరంభం కానుంది. మే 11న ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ ఏడాది చివర్లో భారత్‌లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌కు సన్నాహకంగా ఉపయోగపడుతుంది.

ముక్కోణపు సిరీస్ షెడ్యూల్

ఏప్రిల్ 27: భారత్ × శ్రీలంక
మే 1: శ్రీలంక × సౌతాఫ్రికా
మే 6: భారత్ × సౌతాఫ్రికా
ఏప్రిల్ 29: భారత్ × సౌతాఫ్రికా
మే 4: భారత్ × శ్రీలంక
మే 8: సౌతాఫ్రికా × శ్రీలంక
మే 11: ఫైనల్

ఛాంపియన్స్ ట్రోఫీ

ఫైనల్‌కు అంపైర్లు వీరే

- ఐసిసి

దుబాయ్: ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్ మ్యాచ్‌కు అంపైర్ల జాబితాను ఐసిసి గురువారం ప్రకటించింది. ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా పాల్ రీఫిల్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, థర్డ్ (మూడో) అంపైర్‌గా జోయల్ విల్సన్ విధులు నిర్వహించనున్నాడు. ఫోర్త్ (నాల్గో) అంపైర్‌గా కుమార ధర్మసేన.. మ్యాచ్ రిఫరీగా రంజన్ మదుగలే వ్యవహరించనున్నట్లు వెల్లడించింది. పాల్ రీఫిల్ సౌతాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగిన రెండో సెమీస్‌లో ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించగా.. ఇల్లింగ్‌వర్త్, భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన తొలి సెమీ ఫైనల్‌కు ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించాడు. నాలుగు సార్లు ఐసిసి అంపైర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచిన ఇల్లింగ్‌వర్త్.. 2023 వన్డే వరల్డ్‌కప్, 2024 టి20 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లోనూ ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించాడు. మార్చి 9న దుబాయ్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ జరగనుంది. ఐసిసి ట్రోఫీ ఫైనల్లో ఇరుజట్లు తలపడటం ఇది రెండోసారి కాగా.. రెండుసార్లు కివీస్ విజేతగా నిలిచింది.

యుఎఇలో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష అమలు

న్యూఢిల్లీ : యుఎఇలో హత్యలకు పాల్పడ్డారంటూ ఇద్దరు భారతీయులకు అక్కడి ప్రభుత్వం ఉరిశిక్షను అమలుచేసినట్లు విదేశాంగశాఖ గురువారం వెల్లడించింది. ఈ సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు కూడా తెలియజేసింది. మరణశిక్షకు గురైనవారిని కేరళకు చెందిన మహమ్మద్ రినాష్ అరింగిలొట్టు, మురళీధరన్ పెరుమ్తట్టు వలప్పిల్‌గా గుర్తించారు. యుఎఇ వాసి హత్య కేసులో మహమ్మద్ రినాష్‌కు, ఓ భారతీయుడి హత్య కేసులో మురళీధరన్‌కు శిక్షపడింది. వీరిద్దరికి అవసరమైన దౌత్య,న్యాయ సాయం అందజేసినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. యుఎఇలో భారతీయ మహిళ షెహజాది ఖాన్‌కు ఫిబ్రవరి 15న ఉరిశిక్ష అమలుచేసిన విషయం రెండ్రోజుల క్రితమే వెల్లడైంది. దాదాపు ఏడాది పాటు ఆమె న్యాయపోరాటం చేసినా ఫలితం లభించలేదు.

ఉదయనిధిపై కొత్త కేసులు నమోదు చేయొద్దు : సుప్రీం

న్యూఢిల్లీ : సనాతన ధర్మంపై తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై కొత్త కేసులు నమోదు చేయవద్దని గురువారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆయనకు అరెస్ట్ నుండి మధ్యంతర రక్షణను పొడిగించామని, ఈ కోర్టు అనుమతి లేకుండా తదుపరి కేసులు నమోదు చేయకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఉదయనిధి తరపున సీనియర్ న్యాయవాదులు ఎఎం సింఘ్వీ, పి.విల్సన్ వాదనలు వినిపించారు. బీహార్‌లో ఆయనపై కొత్త ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు కోర్టుకు తెలిపిన అనంతరం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

భారత్‌కు అప్పగింతపై స్టే విధించండి

- అమెరికా సుప్రీం కోర్టులో తహవ్వూర్ రాణా పిటీషన్

న్యూఢిల్లీ : తనను భారత్‌కు అప్పగించడంపై అత్యవసర స్టే విధించాలని కోరుతూ 26/11 దాడి కేసులో నిందితుడు తహవూర్ రాణా అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భారత్‌లో తనను విచారిస్తే వివిధ కారణాలతో తాను ఎక్కువ కాలం జీవించలేనని పిటీషన్‌లో రాణా తెలిపారు. 'ఒక వేళ స్టేను అమలు చేయకపోతే, ఇక ఎక్కడా సమీక్ష చేయడానికి ఉండదు. అమెరికా కోర్టులు తమ అధికార పరిధిని కోల్పోతాయి. పిటిషనర్ త్వరగా చనిపోతాడు' అని పిటీషన్‌లో పేర్కొన్నారు. తాను పాకిస్థాన్‌కు చెందిన ముస్లింను కాబటి, భారత్‌లో విచారణ సమయంలో హింసకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మధ్యప్రదేశ్‌లో పోలీసుల జులుం

- గోవధ కేసులో నిందితులకు బహిరంగ దండన, పరేడ్

భోపాల్ : బిజెపి పాలనలోని మధ్యప్రదేశ్‌లో పోలీసులు రెచ్చిపోయారు. గోవధ కేసులో అరెస్టు చేసిన ఇద్దరు నిందితులపై ఖాకీలు జులుం ప్రదర్శించారు. పట్టపగలు బహిరంగంగా నడి రోడ్డుపై వారిని లాఠీలతో కొడుతూ సుమారు రెండు కిలోమీటర్లు నడిపించారు. దెబ్బలకు తాళలేక నిందితుల్లో ఒకరు కిందపడిపోయినా పోలీసులు వదల్లేదు. పైకి లేచిన తరువాత మళ్లీ కొట్టారు. పైగా నిందితుల చేత 'ఆవు మా తల్లి, పోలీసులు మా తండ్రి' అని బలవంతంగా నినాదాలు కూడా చేయించారు. ఈ నెల 3న ఉజ్జయిని నగరంలోని ఘటియా పోలీసు స్టేషన్ ప్రాంత పరిధిలో జరిగిన ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సంఘటన తరువాత ఘటియా పోలీసు స్టేషన్ సిబ్బందిని భజరంగ్‌దళ్, విహెచ్‌పి నాయకులు సత్కరించడం విశేషం. ఈ ఘటనపై ఉజ్జయిని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ప్రదీప్ శర్మ మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడాన్ని ధ్రువీకరించారు. నిందితుల్ని కొట్టడం, కవాతు చేయడంపై తనకు సమాచారం లేదని, పరిశీలిస్తానని చెప్పారు. అదనపు ఎస్‌పి గురుప్రసాద్ పరాసర్ మాట్లాడుతూ 'ఇది అంత తీవ్రమైన విషయం కాదని అన్నారు. 10 రోజుల క్రితమే గో వధ గురించి ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసామని చెప్పారు.

వన్డేలకు ముష్ఫికర్ గుడ్‌బై

ఢాకా: బంగ్లాదేశ్ వికెట్ కీపర్, బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. చాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన 37ఏళ్ల రహీమ్ తన నిర్ణయాన్ని సోషల్ మీడియా గురువారం వెల్లడించాడు. "వన్డేలనుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా.. నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ప్రతిసారి జట్టు కోసం వంద శాతం అంకితభావంతో ఆడా" అని పేర్కొన్నాడు. బంగ్లాజట్టు ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ స్టేజ్‌లోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే. 2006లో వన్డేల్లో అరంగేట్రం చేసిన రహీమ్... 20ఏళ్లు ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 274వన్డేల్లో 36.42 సగటుతో 7795 పరుగులు చేశాడు. ఇందులో 9సెంచరీలు, 49అర్ధ సెంచరీలు ఉన్నాయి. 94టెస్టులు, 102 టి20లు కూడా ఆడాడు. బ్యాటర్‌గానే కాదు.. కీపర్‌గా కూడా రహీమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముష్ఫికర్ తన వన్డే కెరీర్‌లో కీపర్‌గా 297 మందిని ఔట్ చేశాడు. ఆల్ టైం కీపర్ల లిస్టులో సంగక్కర, గిల్‌క్రిస్ట్, ధోనీ, బౌచర్ సరసన ముష్ఫికర్ నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68